శ్రీరస్తు.

# నానారాజన్యచరిత్రము.

ఇది

మచిలీపట్టణస్థ నోబిల్ కళాశాలాంధ్రోపాధ్యాయులును,
చంద్రకాంత, జపానీయము, మార్కండేయవిలాసము,
వాసంతిక, ప్రియదర్శిక, కృష్ణరాయల కొండవీటివిజయము
మున్నగు గ్రంథములకు కర్తలును

నగు

శ్రీరామ్ వీరబ్రహ్మము గారిచే

రచియింపఁబడి


శ్రీ వేంకటగిరి సంస్థానాధీశ్వరు లగు
శ్రీ రాజా వెలుగోటి గోవిందకృష్ణయాచేంద్ర బహదరువారి
యంకితముగఁ

ప్రకటింపఁబడియె.

---

**1918.**

*Copy right reserved.*] [Price Rs. 3



గ్రంథకర్త:
శ్రీరామ్ వీరబ్రహ్మము, మచిలీపట్నము.

# Nana Rajanya Charitramu

Dedicated

Most Respectfully

To

SRI SRI SRI RAJAH VELUGOTI
GOVINDA KRISHNA YAÇHENDRA
BAHADAR GARU
RAJAH OF VENKATAGIRI

With Kind Permission

BY

THE AUTHOR.



కృతిపతులు:
శ్రీరాజా లెఫ్టినెంటు వెలుగోటి గోవిందకృష్ణయాచేంద్ర బహదరుగారు,
వేంకటగిరి.

శ్రీరస్తు.

# వేంకటగిరి సంస్థానము.

(నెల్లూరు జిల్లా)

క॥ శ్రీ వెలుగోట్యన్వయపా
రావారశశాంక! సకల ♦ రమ్యగుణాంకా!
గోవిందకృష్ణయాచేం
ద్రా! వినుతరకీర్తిసాంద్ర! ♦ ధాత్రీశేంద్రా.

* సీ॥ పటుతరధీరులై ♦ భవదీయ పూర్వులు
తేజమొప్పఁగ యోధ ♦ లై జయాంక
శాలురై తారకే♦శసమానకీర్తిని
ధానులై బుధగేయు♦లై నితాంత
భక్తులై భూరికా♦వ్యసతీవిమోహిత
పూతసద్గుణధాము♦లై తదీయ
చరితచే ధారుణీ♦శ్వరకోటినగ్రతఁ
దాల్చిరాజిలి రాఁగ♦దాయటంచు

---

* ఈ పద్యము మత్తకోకిల కందగర్భ సీసమగుటచే నీదిగువ మత్తకోకిల సీసమునందును గందము గీతమునందును గాననగును.

మత్తకోకిల:—ధీరులై భవదీయపూర్వులు ♦ తేజమొప్పఁగ యోధ లై
తారకేశసమానకీర్తి ని♦ధానులై బుధగేయు లై
భూరికావ్యసతీవిమోహిత ♦ పూతసద్గుణధాము లై
ధారుణీశ్వరకోటి నగ్రత ♦ దాల్చిరాజిలి రాఁగదా.

తే॥ గీ॥ సుకవులు నుతింపఁ గోవిద ♦ నికరమలర
నర్థిలోకనిర్జరతరు ♦ వై సతంబు
సకలసుగుణాశ్రయుఁడవగు ♦ ప్రకటిత వెలు
గోటివంశవర్ధనుఁడవగు ♦ తౌటఁదగవె ?

ఈ వేంకటగిరి సంస్థానము దక్షిణహిందూదేశ సంస్థానములలో మిగులఁ బురాతనములగువానిలో నొకటి. ఈసంస్థానము (1) వేంకటగిరి (2) సగుటూరు (3) నుల్లూరు (4) పోలూరు (5) మనుబ్రోలు (6) పెళ్లూరు (7) పొదిలె (8) దర్శి (9) కొచ్చెర్లకోట (10) మారెళ్ల అను బదితాలూకాలుగ విభజింపఁబడి యాయాయుద్యోగస్థులచే వ్యవహరింపఁ బడుచున్నది.

ఈ సంస్థానమంతయు 2,117 చదరపుమైళ్లు విస్తీర్ణము గలిగి 625 జిరాయితీ గ్రామములును 215 అగ్రహారములును 12 దేవాగ్రహారములును 10 అమరములును వెరసి 862 గ్రామములను గలిగియున్నది. ఈ సంస్థానము మొత్తముమీఁద రాఁబడి పదునొకండు లక్షలు. అందు రోడ్డుసెస్, మన్నెకావలి రుసుములు మున్నగువానిలోఁ జేర్చి పేష్కష్‌లోఁగూడ గవర్నమెంటువారికి చెల్లింపఁదగిన మొత్తముకొంచె మించుమించుగా నాల్గులక్షల నలుబదివేలు (4,40,000) అగుచున్నది. జాగీసిబ్బందిమీఁద నేర్పఱుపఁబడినదగుటచే నీపేష్కష్ ఇతర సంస్థానములకంటె నెక్కువగానున్నది.

ఈ సంస్థానములో సువర్ణముఖి, ముసి, గుండ్లకమ్మ, కైవల్య నది మున్నగునదులు ప్రవహించుచుండును. ఆ యాగ్రామములలోఁ జేరువడసిన గొప్పతటాకములును గలవు. వేంకటగిరి తాలూకాలో గొప్ప యరణ్యముగలదు. అందు రక్తచందనము, ఏపె మొదలగు వృక్షములు విశేషించి కలవు.

---

క॥ సుకవులు నుతింపఁ గోవిద
నికరము లర్థిలోక ♦ నిర్జరతరువై
సకలసుగుణాశ్రయుఁడ వయి
ప్రకటిత వెలుగోటివంశ ♦ వర్ధనుఁడయితౌ.



ఈ సంస్థానమునకు రాజధాని వేంకటగిరి యగుటచేతనే వేంకటగిరి సంస్థానమని పిలువఁబడుచున్నది. ఈ వేంకటగిరి చెన్నపురికి వాయువ్యభాగమున 100 మైళ్లదూరమునను నెల్లూరునకు దక్షిణమున 50 మైళ్లదూరముననున్నది. ఈ పురమునకు, బశ్చిమమున నెనిమిది మైళ్లదూరములోనున్న పర్వతములలో నభేద్యమగు నొకదుర్గము గలదు. దానిని 'కలిమిలి' దుర్గమందురు. అందు జలాశయములును సౌధరాజంబులును గలవు. యుద్ధప్రసక్తిగల పూర్వకాలమున నీదుర్గమం దంతఃపురాంగనానివహమును, ధనాగారంబులును, గోప్యవస్తుసముదాయమును దాపఁబడుచుండెడిది. ఇది నేఁటివఱకును సుచితస్థితిలో నుండెను. ఈ వేంకటగిరిసంస్థానములోఁ బూర్వ మొక గొప్పకోట గలదు. ఇప్పుడది శిథిలమై యగడ్తమాత్రము శేషచిహ్నమైయున్నది. ఆభాగముననున్న గ్రామ మిప్పటికిని 'ప్రాఁతకోట' యని వ్యవహరింపఁబడుచుండెను. మఱియుఁ బూర్వమిందనేకములైన గొప్పశతఘ్నులు (ఫిరంగులు) లుండెడివి. కాని మనదొరతనమువారిచేఁ బ్రస్తుతమున గౌరవార్థముపయోగించుటకై నాలుగు ఫిరంగులు మాత్ర ముంపఁబడి మిగిలిన వెల్లఁ గొంపోఁబడియెను.

ఈ పట్టణమున మిగుల రామణీయకములై, యత్యున్నతములగు పెక్కురాజమందిరములును, విజయమహాలు, రాజనివాసభాగ్, లంగర్ఖానాతోట (రాజోద్యానవనము) ఖాస్‌బంగ్లా, ఆట్ ఫైల్ బంగ్లా, జూబ్లిరెస్టుహౌస్ (విశ్రాంతిగృహము) మున్నగు నెన్నియో బంగ్లాలు గలవు. మఱియు నిందు సబ్ మేజస్ట్రేటువారి యాఫీసు, పోలీసుస్టేషన్, సబ్ రిజష్ట్రారువారి యాఫీసు, తపాలతంతి యాఫీసు, శ్రీవేంకటకృష్ణయాచేంద్రులవారు కట్టించిన లోకల్ ఫండు ఆసుపత్రియుఁ గలవు. సుందరములై శోభాయుతములైన దేవళములు బదికి మించియున్నవి.

ఈ పట్టణములోఁ జైత్రమాసమున శ్రీకోదండరామస్వామివారికిని, వైశాఖమాసమున శ్రీవరదరాజస్వామివారికిని, జ్యేష్ఠమాసమున శ్రీ కాశీవిశ్వనాథస్వామివారికిని, నాషాఢమాసమున శ్రీ చెంగల్వారా

యస్వామివారికిని, బ్రహ్మోత్సవములు జరుగుచుండును. మఱియు మిగిలిన యెనిమిది మాసములయందును నానాదేవతల కుత్సవములు మిక్కిలి వేడుకతో జరుపఁబడుచుండును. ఇందువలననే 'వేడుకకు వేంకటగిరి'యని పేరుగాంచియున్నది.

ఈ సంస్థానపరిపాలకుల మూలపురుషుండగు చెవిరెడ్డి ఘనత గాంచిన కాకతిగణపతిదేవుని రాజ్యకాలమునందు మహావీరుండై తన ధైర్యస్థైర్యాది గుణగణంబులచే నారాజువలన మిక్కిలి గౌరవింపఁబడుటయగాక పెక్కుబిరుదములను మఱికొంత రాజ్యమును సంపాదించియుండెను. వీనిజనకుండు కామరాజు, పితామహుండు కాటరాజు, ప్రపితామహుండు ముంజరాజు, అటుపైని రామలింగారెడ్డి, ముక్కంటిరెడ్డి, మహీపతిరెడ్డి, వీరభద్రారెడ్డి, విక్రమరెడ్డి, హేమాద్రిరెడ్డియని మఱికొందఱు పూర్వులును రాజ్యముచేసినట్లుండినను సవక్రవిక్రమంబున గణపతిదేవునొద్ద మిగుల మన్ననగాంచి పద్మనాయకకులోద్ధారకుండయి జగత్ప్రసిద్ధిగాంచినందున నీచెవిరెడ్డినే మూలపురుషుండుగ రేచర్లగోత్రజులగు వేంకటగిరి, పిఠాపురము, బొబ్బిలి, జటప్రోలు, మైలవరము, మున్నగువారి చరిత్రములందు జెప్పఁబడియుండెను. ఈ రేచర్లగోత్రమునందు ముప్పదియాఱు తెగలవారుగలరు. ఆవివరము వెలుగోటివారి వంశచరిత్రమునందుఁ గాననగును.

వీరి రాజ్యకాలారంభమునుగుఱించి యొకశాసనమందు—

* శ్లో॥ శ్రీమత్పద్మజ పాదపద్మయుగళా ల్లోకత్రయాభ్యర్చితా
దుద్భూతే విపులేకులే నరవరో భీమాభిధానో భవత్
యః కాంచీనగరీ కవాటహరణం కృత్వా ప్రచండాహవ
క్రీడశ్చోళ నరాధిపస్య కృతవా న్మానగ్రహోన్మూలనమ్."

* లోకత్రయపూజ్యంబగు కమలాసనుని పాదపద్మములనుండి యుద్భవించినకులమందు భీమరాజుండెను. అతఁడు కాంచీనగరకవాటమును భేదించి ప్రచండమైనరణము సలిపి చోళరాజునకు మానోన్మూలనంబుగావించెనని యర్థము.



"ఈరాజశిఖామణి యేకాలమునాఁటివాఁడో తెలియదు. భేతాళచరిత్రములోఁ జెప్పఁబడిన పదితరములవారిలో లేనందున నంతకుఁ బూర్వమువాఁడై నరదీపకుఁడై యుండవలెను. ఇట్లు చూడఁగా నించుమించుగా శాలివాహనశకప్రారంభమునుండియు వీరిరాజ్యముండినట్లు తోఁచుచున్నది." అని చరిత్రాంశములందుఁ గలదు. అయినను జెవ్విరెడ్డి రాజ్యకాలముమాత్రము వీనిసోదరుఁడగు నామిరెడ్డియొక్కయు భార్యయైన యెఱ్ఱక్కసానమ్మయొక్కయు శాసనములవలనఁ గ్రీస్తుశకము పండ్రెండవశతాబ్దము కడపటిభాగము పదమూఁడవశతాబ్దముయొక్క యాదిభాగమునని తేలుచున్నది. ఈశాసనములు నైజామురాజ్యములోని నల్లకొండజిల్లా సూర్యపేట తాలూకా పిల్లలమఱ్ఱిగ్రామమధ్యమునఁ గల దేవాలయమునందుఁగలవు. అందు నామిరెడ్డిశాసనములో—

"శ్లో॥ శాకాబ్దే శైలతారాంపతి భవగణితే వత్సరే రాక్షసాఖ్యే
వైశాఖే శుక్లపక్షే కుసుమశరతిథౌ వాసరే భాస్కరస్య
లింగానిత్రీణిసోయం త్రిపురవిజయినస్సంప్రతిష్ఠాప్య వృత్తీః
ప్రాదాత్తత్పూజనార్థం సుకృతవితతయే స్వస్యమాతుఃపితుశ్చ."

అనియు నెఱ్ఱక్కసానమ్మశాసనమునందు

"శ్లో॥ శాకాబ్దే సురవర్త్మ రామ ధరభృద్విశ్వంభరా సంఖ్యయా
సంయుక్తే విభవాఖ్య వత్సరవరే జ్యేష్ఠేమృడాన్యాస్తిథౌ
శుక్లాయాం శనివాసరే జననుతే శ్రీలింగమూర్త్యోర్విభో
స్సేయం హేమవతీపతేః కృతవతీశ్రేష్ఠ ప్రతిష్ఠాపనమ్."

అనియుఁ గలదు. అనఁగా మొదటిశాసనము శాలివాహనశకము 1117 రాక్షససంవత్సరమనఁగా క్రీ॥ శ॥ 1195 వ సంవత్సరమును రెండవశాసనము శాలివాహనశకము 1130 విభవసంవత్సరమనఁగా క్రీ॥ శ॥ 1208 సంవత్సరము నగుచున్నది.

వీరు పద్మనాయకకులజులు. పద్మనాయకుఁడనఁగా సూర్యునకును బద్మపతియను నొకరాజునకును నర్థముగలదు. కావున సూర్యవంశ

ముచారిగుటచేతను బ్రహ్మండను రాజువలనఁ జ్యుతసంస్కారులై యతని నాయకత్వమునకుఁ జిక్కినవారగుటచేతను నట్టియర్థమిచ్చునటుల వీరు పద్మనాయకవంశజులని వ్యవహరింపఁబడుచుండిరి. అదెట్లనఁగా సూర్యచంద్రవంశజులగు క్షత్రియులలోఁ గొందఱను మహానందియను రాజునకు శూద్రస్త్రీయందు జనించిన మహాపద్మపతియనువాఁడు దుర్మదాంధుడై తనకు వందనాదు లాచరింపుఁడని నిర్బంధించి వశపడనివారిని నిర్వక్రపరాక్రమమున లోఁబఱచుకొని కొన్ని వత్సరములు కారాగృహవాసులఁ జేసెను. అప్పుడు వారు స్వీయజాత్యుచితసంస్కారవిహీనులై పెద్దకాలంబు కారాగృహంబున నుండనోపక పద్మపతికి వందనాదు లొనరింప నంగీకరించి తదనుగ్రహంబునఁ జెఱనుండి విముక్తిగాంచి వెడలిరి. అట్టిశూద్రరూపధరులగు క్షత్రియులు తాము సూర్యవంశజులమనియుఁ బ్రహ్మనకు లోఁబడినవారమనియుఁ దెలుపుటకుఁగాను దాము పద్మనాయకవంశజులమని చెప్పుకొనుచుండిరట్లు తోఁచెడిని. కావున నీపద్మనాయకులు పూర్వము క్షత్రియులయ్యుఁ బ్రహ్మనికారణమున శూద్రావతారులైరి. ఇందుకు మార్కండేయపురాణోత్తరఖండములోని యీదిగువ శ్లోకములు నిదర్శనములుగాఁగలవు.

"శ్లో॥ మహానంది ర్మహారాజో రాజ్యంకుర్వన్మదోత్కటః
సరాజో రాజకన్యాంచ ఏకాం శూద్రకులోద్భవాం॥
కన్యాంగృహీష్యతి ముదాపత్నీత్వే నామతశ్చ్యుతిం
మహానస్తు సుతో రాజన్ శూద్రాగర్భోద్భవో బలీ॥

... ... ... ... ... ... ...

మహాపద్మపతిః కశ్చిన్నృపః క్షత్రవినాశకృత్"

... ... ... ... ... ... ...

... ... ... ... ... ... ...

క్షత్రవేషవిహీనాశ్చ శస్త్రాస్త్రపరివర్జితాః
స్నానసంధ్యావిహీనాశ్చ హోమకర్మవివర్జితాః॥



వేదోక్తాచారహీనాశ్చ శూద్రాచారైకతత్పరాః
శూద్రానీతోదకం సమ్యగ్గృహ్యమాణాశ్చ భూమిపాః॥

మత్స్యమాంసాదనాశ్చైవ శూద్రాఇవశిఖావృతాః
కారయిష్యంతి రాజానః శాసనాన్నందభూపతేః॥

... ... ... ... ... ... ...

... ... ... ... ... ... ...

వింధ్యస్య దక్షిణేభాగే సముద్రప్రాంతమన్వితాన్
కళింగాంధ్రవిదర్భాంగదేశానాక్రమ్య భూమిపాః॥
తదాది భూమిపాలాశ్చ సూర్యసోమ సముద్భవాః
పూర్వోక్తేన ప్రకారేణ భవిష్యంతి నసంశయః॥"

జన్మమునను క్షత్రియులయ్యుఁ బూర్వోక్తకారణాంతరములచే శూద్రప్రాయులుగ నుండినంతమాత్రమున సామాన్యశూద్రులుగఁ జేర్చి వీరిని శూద్రులుగ వ్యవహరించుట యుచితముకాదని శ్రీనాథకవీంద్రుఁడు సైతము "సచ్ఛూద్రు"లని వచించియుండెను. మ॥ రా॥ శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిగారు తమ "రాజవంశీయుల చారిత్రము"నందు 'సచ్ఛూద్ర' శబ్దార్థనిరూపణమును జేయుచు—"ద్విజాతులగు బ్రహ్మక్షత్రియ వైశ్యులు మువ్వురును జన్మకాలమున శూద్రులేయనియును, వారికి గర్మచేత ద్విజత్వము కలుగుననియు 'జన్మనాజాయతే శూద్రః। కర్మణాజాయతే ద్విజః' అను శాస్త్రముంబట్టి చెప్పవలసియున్నది. వీర లేవఱకుఁ గర్మలనుజేసిన నావఱకును ద్విజులును దాని యభావమున శూద్రులు నగుదు రను దానికి దృష్టాంతముగా ద్విజులు కొన్ని తప్పుకార్యములు సేయునపుడు పతితులై పోవుదురనియు నట్టిపట్లఁ దిరుగ నుపనయనసంస్కారము చేసికొనవలయుననియు శాస్త్రమున్నది. ఏకారణముచేనైన నదిలేనివాఁడు శూద్రుఁడై యటనుండి తమవంశము నన్నఁగా సంతానమును శూద్రులుగా నొనరించెదరు. అయిన నిట్లుగా శూద్రత్వముబొందిన ద్విజాతులు జన్మచేత శూద్రులుగా నుండెడివారికంటె నధికులై ద్విజులకంటెఁ దక్కువగా వ్యవహరింపఁ

బహువారు. కావుననే యిట్టివారినిగూర్చి వ్రాయుచో వీరందఱును సచ్ఛూద్రులని గ్రంథాదులయందు ననుసంధించిరి" అని వ్రాసియుండిరి. కావున నీరహస్యమెఱింగియే సామాన్యశూద్రులట్లుగాక చ్యుతసంస్కారులైనకారణమున నిక్షత్రియులను శ్రీనాథకవీంద్రుండు సైతము తన భీమఖండమున —

"ఉ॥ కైటభదైత్యవైరిపద♦కంజమునం దుదయంబునొందె ని
న్నేటికి భూతధాత్రికిని ♦ నెంతయు వచ్చిన తోడబుట్టువై
హాటకగర్భముఖ్యనిఖి♦లామరమౌళి మహామణిప్రభా
పాటలవర్ణమైన యొక ♦ పావనవర్ణ ముదీర్ణసంపదన్."

వ॥ అప్పుణ్యవంశంబునం ...... బద్మనాయకులను వెలమలనం, గమ్మలన, సరిసర్లనం, బాటర్లన బహుప్రకారశాఖోపశాఖాభిన్నంబులయిన మార్గంబులం ద్రిమార్గగంగాప్రవాహంబునుంబోలె గోత్రంబులెన్నియేనియు జగత్పవిత్రంబులై ప్రవహించుచుండ ... ..."

అని యీవంశమును "పావనవర్ణము, అప్పుణ్యవంశంబున, జగత్పవిత్రంబులై" యని వర్ణించియున్నాడు. వాస్తవమిట్లుండఁగఁ జిలుకూరి వీరభద్రరావుగారు తమ 'యాంధ్రులచరిత్రము' యొక్క ద్వితీయభాగ మధ్యయుగమునం బదవప్రకరణమునందు 'వెలమ, కమ్మ, కాఁపు తెగలవారు మిశ్రజాతివారనియుఁ గొల్లజాతివారియుఁ బల్లెజాతివారియు సమ్మేళనమున నుదయించినా'రనియు నేమేమో ప్రమాణదూరంబైన విషయమును యథార్థమనునట్లు వ్రాసియున్నారు. ఇందునుగుఱించి శ్రీ వెల్లాల సదాశివశాస్త్రిగారు తమ "వీరభద్రీయఖండన" మని నామాంతరముగల "యాంధ్రచరిత్రవిమర్శ" మనుగ్రంథమున విపులముగఁ జర్చించి యథార్థమును విశదీకరించియున్నారు. మఱియుఁ బరమతసహిష్ణుతలేమిం గాంబోలు రావుగారు వేదాధ్యయనాధ్యాపకాధికారంబుగలిగి యజ్ఞోపవీతధారులై "శూద్రత్వం నాస్తి తద్వంశే గర్భబ్రాహ్మణనిశ్చయం" అని విశ్రుతిగన్న విశ్వబ్రాహ్మణులను వృత్తినామంబుబురస్కరించుకొని — "కులవిచక్షణములేని బ్రహ్మనాయఁడు మాలలు, మాదిగలు, గొల్లలు, కంసాలులు, కమ్మరులు, కుమ్మరులు, రజకులు, రెడ్లు మొదలగు తెగలవారితోఁ గలిసి చాపకూడు గుడిచె"నని యున్నట్లు వ్రాసినారు. ఎందేనసంగతములున్నఁ జరిత్రకారు లట్టివానిని విమర్శించి యథార్థమును నిరూపింపవలెఁగాని పరమప్రమాణంబులుగ నంగీకరింపరాదుగదా! ఇట్లే వెలమ శబ్దోత్పత్తినిగుఱించియు నేమేమో వ్రాసినారు. ఈవిషయమంతయు శ్రీసదాశివశాస్త్రులవారిచే విమర్శింపఁబడియే యున్నది. కనుక నికఁ బ్రస్తుత మనుసరింతము.



ఈ సంస్థానాధిపులు పద్మనాయకవంశజు లయ్యు "వర్మాంతనామాపి నరేంద్రచిహ్నమ్" అను వాక్యానుసారముగ నామాంతమందు వర్మశబ్దముగలిగి తానురాను వర్మశబ్దభవమగు వెలమలను వ్యవహారనామంబునఁ బ్రసిద్ధులైరి. ఈ విషయమును గుఱించి శ్రీ గురజాడ రామమూర్తిగారు తమ 'రావువంశీయుల చారిత్రము' నందు "ఈ శాఖకు 'వెలమ'నామము, నియోగిబ్రాహ్మణులకు వ్యవహారనామముగ వచ్చిన 'కరణము'లను నట్లుగా, వ్యవహారకారణమున గతానుగతికపరిలబ్ధము" అని వ్రాసియుండిరి. ఈ వెలమవారింగూర్చి యిట్లు వర్ణింపఁబడియున్నది:—

"సీ॥ మానంబుతగుగాఁక ♦ మహిమోన్నతిఁ జెలంగు
మానంబుసాహిత్య ♦ మాన్యగుణము
మానంబునృపతికి ♦ మన్ననమొదవించు
మానంబుదాతకుఁ ♦ దానకంబు
మానంబువిశ్రాంతి ♦ మానధనంబును
మానంబుసాధ్వికి ♦ మంజువ్రతము
మానంబుసత్కుల ♦ మహిమసంపాదించు
మానంబుదేవ సా♦మాన్యపథము
తే॥గీ॥ అట్టిమానంబు వెలమల ♦ కాస్పదంబు
నమితపతిహిత సన్మాన♦మందు ఘనులు
గజపతి ద్రోహిగండాంక♦కలితయశులు
వీరులైనట్టి నెఱమన్నె ♦ వెలమవారు."

ఇట్టి పద్మనాయక వంశోద్భూతుండయిన చెవిరెడ్డి వంశపరంపరాగతమై ప్రస్తుతము నైజాంరాజ్యమునకు జెందియున్న నల్లగొండమండలములోని యామనగల్లు రాజధానిలోను, దనచేఁ బ్రబలపఱుపఁ బడిన పిల్లలమఱ్ఱిరాజధానిలోను వసించి రాజ్యమేలెను. ఈ రాజునకుఁ జెవిరెడ్డియను జన్మనామము మాఱి భేతాళనాయఁడను పౌరుషనామము గలుగుట కీ క్రిందికథ కారణమై యుండెను.

వీరికి బూర్వము పదవతరమువాఁడైన హేమాద్రిరెడ్డి మహాభుజపరాక్రమమున రాజ్యమేలుచుఁ గోట్లకొలఁది ద్రవ్యమార్జించి దానినొకచో నిక్షేపించి దానిపై నొకవేదిక గట్టించి యందొక వటవృక్షమును నాటించి దానిక్రింద నొకభైరవుని బ్రతిష్ఠించి—'స్వామీ! మీరీధనమును గాపాడి నాసంతతిలో నతిభుజబలపరాక్రమవంతుఁడును సత్కర్మరతుండును గుణయుతుండును నగువాని కందఁజేయవలయున'ని ప్రార్థించి నిజాభిప్రాయము తెలియునట్లు తత్సమీపమున రహస్యముగ నొకశిలాశాసనమును స్థాపించిచనియె. అంతఁగొంతకాలమునకుఁ జెవిరెడ్డి రాజ్యపాలన మొనరించుచు మృగయార్థమై యాప్రాంతమునకు వచ్చుటయు నాసమయమునందే వీరిపోష్యవర్గములోనివాఁడగు రేచఁడను నొకమాలవాఁడు సేద్యముజేసికొన భూమినిదున్నుచుండ నాఁగేటికొనకు ఖంగుమని పూర్వోక్తశాసనము దగులుటచే విస్మయుఁడై యటునిటుఁజూచి తనయేలిక యాదారిన చనుచుండుటనుగాంచి సంతసించి తత్క్షణమా ప్రభుమ్రోలకువచ్చి యాయుదంతంబు నివేదించుటయుఁ దటస్థమయ్యెను.

అంత రాజా శిలాశాసనమును బఠించి తమపూర్వునిచే స్థాపితమైన ద్రవ్యంబును స్వీకరింపఁ బ్రయత్నించుచుండుతఱిని జెంతనున్న వటవృక్షము నాశ్రయించుకొనియున్న భేతాళుండు వీరి ధైర్యమును బరీక్షించుటకై మాయామయములగు మేఘములు, నుఱుములు, మెఱుపులు గల్పించి పిడుగులు పడునట్లుచేయుటయగాక యావటవృక్షమును వానియందు బడునట్లు కూలఁద్రోసెను. అప్పుడు రేచఁడు మూర్ఛిల్లెఁగాని యావీరశిఖామణి మాత్రము ధైర్యముతో నిలవఁబడియుండఁ



గా భేతాళుఁడు వెండియు దద్ధైర్యపరీక్షకై ఘోరాకృతిందాల్చి యావృక్షమునుండి చెవిరెడ్డిముందు దుముకగా నావీరుఁడు కోపోద్దీపితుండై నిజకరవాలంబునఁ దెగనఱక నుద్యమింపఁగా భేతాళుండు నావీరాగ్రణి ధైర్యసాహసాదులకు మెచ్చి నిజరూపముతోఁ బ్రత్యక్షమై తన్నెఱింగించి వలయువరంబులఁ గోరుమనియె. అంత నారాజు తమ సంతానమువా రనవరత రాజ్యభోగంబులును శౌర్యధైర్యాది సుగుణపుంజంబులును గలిగి యుండునటులను, దాము యుద్ధమునకుఁ బోవునపుడు తమకు సహాయుఁడై భేతాళుండు ముందునడుచునటులను రెండువరములఁ గోరుకొనెను. అంత భేతాళుం డనుగ్రహించి యంతర్ధానుఁ డయ్యెను.

పిమ్మట నారాజానందపరవశుఁడై యానిక్షేపంబును బెకలింపఁబోవుతఱి నచ్చటఁగల భైరవమూర్తి యశరీరవాక్యములతో 'ఓరాజా! యీధనమును గైకొనుటకర్హుఁడవగుదువైనను నిందుఁగొన్ని క్షుద్రభూతము లాసించియున్నవి. వానికి నరబలియొసంగి గైకొనిన నీకు శ్రేయోభివృద్ధియగు'నని వచించెను. అందుల కారాజు నరహత్యాశంకకు జింతింపుచుండ మూర్ఛాగతుఁడై చెంతఁబడియున్న రేచఁడు లబ్ధచేతనుఁడై జరిగిన యుదంతంబు తెలిసికొని తన్నుబలియిచ్చి యాధనమును గైకొనుమని చెప్పెను. అందులకు రాజు స్వీయపోష్యుని వధింప సంశయింపుచుండ మగిడి రేచఁడు—'మీరీధనమువలన లోకహితము గావింపఁగలరు కావున నేఁ గోరినవరములొసంగి నన్నుబలియిచ్చిన మీకు దోషము ప్రసక్తింప'దని పలుక రాజంగీకరించి రేచఁడు కోరినటుల వానివంశమువారిని దరతరములవఱకును శ్రీరాజావారివంశజులు పోషించునటులను, దమవారికి వివాహకార్యములు జరుగనుండినప్పుడు ముందుగ రేచని వంశజులకు వివాహములు జరిగించునటులను నంగీకరించి వానిని బలియిచ్చి యాధనమును గైకొనియెను. నాఁటనుండి భేతాళుని కారణమున వీరికి భేతాళరెడ్డియను బౌరుషనామము గలిగెను.

పిమ్మట నారాజశిఖామణి సర్వపాపఘ్నంబుగ నందొక శివాల

యమును గట్టించెను. ఈ యాలయమునకు నావలఁ బూర్వము వీరి సోదరుఁడు గట్టించిన మఱికొన్ని శివాలయములును వానికిఁ బశ్చిమ భాగమున నొక చిన్నగ్రామమును గలవు.

ఏకశిలానగరాధిపతియగు గణపతిదేవుఁడీ భేతాళరెడ్డి వృత్తాంతంబును జారులవలనఁ దెలిసికొని వారిశౌర్య ధైర్యాదుల కచ్చెరువంది యారాజును రావించి గౌరవించి యదివఱకేలుచున్న యామనగంటి రాజ్యమునకుఁ జేరువనున్న లక్షసీమను గజతురగాదులను గలికితురాయిని గండపెండెరమను బిరుదాభరణమును ఛత్రచామరాదులను మఱియు బంగారుపూఁతపనిగల మొకచౌకళికత్తిని బహుమతిగనిచ్చి పిల్లలమఱ్ఱి భేతాళనాయఁడను బిరుదనామ మిచ్చి పంపించెను. ఈ కత్తియు భేతాళుని నఱికిన నర్తనకత్తియు సంస్థానమునం దిప్పటికిని బూజింపఁబడుచుండెను.

ఈ మొదటితరపు భేతాళనాయనికి దామానాయఁడు, ప్రసాదిత్యనాయఁడు, రుద్రనాయఁడు అను మువ్వురు పుత్రులుగలరు. ఈమువ్వురిలో జ్యేష్ఠుఁడగు దామానాయఁడు ఖడ్గయుద్ధములో సమర్థుఁడైనందున "ఖడ్గనారాయణాంక" అనియు, శత్రువులను దఱిమి వారి రాజ్యసంపదను గ్రహించుటచేత "గాయగోవాళ" అనియు, బలాధికుఁడౌటచేత "బలభీముఁ" డనియు, బిరుదనామములను గండభేరుండమనెడు చిహ్నమును మఱికొన్ని బిరుదములను గాకతీయగణపతిరాయలవలనఁ బొంది మిగుల ధర్మశీలుఁడై ప్రతిరాజభయంకరుండగుటచేత "ప్రతిగండభైరవ" అను బిరుదమునుగూడ వహించి గణపతిదేవుని రాజ్యకాలమైన క్రీ॥ శ॥ 1199 మొదలు 1257 వఱకు యామనగల్లు ప్రాంతరాజ్యము నేలుచుండెను.

ఈదామానాయని బిరుదావళులనుగుఱించి పూర్వకవులీరీతి వర్ణించియుండిరి.

"సీ॥ చటులఖడ్గాఖడ్గి ♦ సమరప్రవీణుఁడై
ఖడ్గనారాయణ ♦ ఖ్యాతినొందె
రణపరాఙ్ముఖరాజ ♦ రమనుజేకొని రాయ
గాయ గోవాళాంక ♦ కలితుఁడయ్యె
నాజి బలాధికుఁ ♦ డౌటచే నెంతయు
బలభీమవిశ్రుతిఁ ♦ బొలుపుమీఱెఁ
ప్రథితారిరాజన్య ♦ భయదవిక్రమమునఁ
బ్రతిగండ భైరవ ♦ ప్రథవహించె
తే॥ గీ॥ మఱియుఁ బెక్కైన బిరుదనా ♦ మములఁదనరి
బాహువిక్రమదాన సం♦పదలఁ బొడఁ
దనరుచుండె సమంచిత ♦ ధామయశుఁడు
భువనహితకారియగు దామ ♦ భూవిభుండు."



మిగిలిన సోదరు లిరువురును గాకతీయగణపతిరాయలవలన మిగుల గౌరవింపఁబడిరనియు నందు ద్వితీయుఁడగు ప్రసాదిత్యనాయఁడు రాయలవారిపట్టణమును ముట్టడించిన తురుష్కులను బాఱఁద్రోలి రాయలవారిచే "కాకతిరాజపూజిత" అను బిరుదమును, శ్వేతచ్ఛత్రధ్వజములను బొందుటయేకాక మిగిలిన దెబ్బదియాఱుగోత్రముల నాయకులచేత మ్రొక్కులంది 'కాకతీయ రాజ్యస్థాపనాచార్య' అనియు మఱికొన్ని బిరుదములందినట్లు ప్రశస్తిగలదు. ఈవంశజుల విక్రమాదులు వెలుగోటివారి వంశచరిత్రమునందు విపులముగా వర్ణింపఁబడియుండి సందునను గ్రంథవిస్తరభీతిచేతను నిందు విస్తరించి వ్రాయఁబడక కేవలము వెలుగోటివంశకర్తలను గుఱించి మాత్రము వివరింపఁబడెడిని.

అట్లు రెండవతరములో జ్యేష్ఠుండగు దామానాయనికిఁ బెక్కండ్రు పుత్రులు గలరు. వారిలో జ్యేష్ఠభార్యయైన జాయమ్మయందు 'వెన్నమనాయఁడు, సబ్బినాయఁడు' అను నిరువురు పుత్రులుగలరు. వీరు గణపతిదేవునిభార్యయైన రుద్రమహాదేవి రాజ్యకాలములోనున్న వారు కావున నాకాలము క్రీ॥ శ॥ 1258 మొదలు 1295 వఱకు నగుచున్నది. ఆమనగల్లు పిల్లలమఱ్ఱిరాజధానులకుఁ బశ్చిమభాగమున 60 మైళ్లదూ

రములోనున్న రాచకొండ రాజధానియందు వసించి యాప్రాంతపు దేశము నేలియుండిరి.

ఈదామానాయనికి దొడ్డనాయఁడను నామాంతరంబుండి యుండవచ్చుననియు వీనికిఁబైనఁ బేర్కొన్న 'వెన్నమనాయఁడు, సబ్బినాయఁడు' అను వారుగాక మఱియేవురుపుత్రు లుండినట్లును వారిలోని వాఁడే పల్నాటి వీరచరిత్రమునందు వర్ణింపఁబడిన బ్రహ్మనాయఁడనియు వెలుగోటివారి వంశచరిత్రమునందు వివరింపఁబడియున్నది. వెన్నమనాయని భార్యయైన పోచమ దేవియందు 'ఎఱ్ఱదాచానాయఁ' డుద్భవించెను.

"తత్ర రేచర్లవంశాబ్ధి శరద్రాకానిశాకరః
కలానిధి రుదారశ్రీ రాసీ ద్యాచమనాయకః"

అనుటంబట్టి వీరికి యాచమనాయఁడని నామాంతరముగలదని స్పష్ట మగుచున్నది. వీరు ద్వితీయప్రతాపరుద్రుని వశంవదులై వారి వలనఁ బాండ్యరాజులమీఁది కంపఁబడిరి గాన వీరి రాజ్యకాలము క్రీ॥ శ॥ 1295 మొదలు 1323 వఱకు నై యుండును. వీరిపాలితభూమి రాచకొండరాజ్యము.

ఈరాజశిఖామణి రెండవప్రతాపరుద్రమహారాజు నానతిచే 'వీరపాండ్య, విక్రమపాండ్య, సుందరపాండ్య, కులశేఖరపాండ్య, పరాక్రమపాండ్యులను పాండ్యరాజుల నైదుగురను వారాక్రమించుకొనియున్న కాంచీనగరప్రాంతమునందే వారల నిర్జించి వారి శిరోభూషణమగు నఱచేతి వెడల్పుగల యొకగొప్పపచ్చను, సువర్ణమయమైన యొకగొప్పసింహాసనమును దీసికొనివచ్చి ప్రతాపరుద్రదేవున కర్పింపఁగా నామహారాజు వారివిక్రమమునకు సంతసించి 'పంచపాండ్యదళవిభాల' 'కంచి కవాట చూరకార' అను బిరుదములను వారుగొనివచ్చిన స్వర్ణ సింహాసన మరకతాదులను జయచిహ్నములుగ వారికే మఱల నొసఁగి గౌరవించెను.



ఈయెఱ్ఱదాచానాయనికి 'సింగమనాయఁడు, వెన్నమనాయఁడు, యాచమనాయఁడు' అను మువ్వురుపుత్రులు గలరు. వీరిలో జ్యేష్ఠుండగు సింగమనాయఁడు ప్రతాపరుద్రునిచే నెనుబదివరములొందినందు వలన 'అశీతి వరాల సింగమనాయఁ' డని ప్రసిద్ధిగాంచెను. ఈసింగభూవరుఁడు నైజాము రాజ్యములో దేవరకొండ తాలూకాయందు గృష్ణానదీతీరమున సిద్ధక్షేత్రముగానున్న యేలేశ్వరములో ననేకబ్రహ్మప్రతిష్ఠలు జరిగించియుండెనని సింగభూపాలీయమునందుఁ జెప్పఁబడియె. మఱియు వీనివిక్రమమునుగుఱించి యందు—

"శ్లో॥ తత్రసిజ్గ మహీపాలే పాలయత్యఖిలా మ్మహీమ్
నమతామున్నతిశ్చిత్రం రాజ్ఞా మనమతాన్నతిః"

అని వర్ణింపఁబడియున్నది.

ఈసింగమనాయనిఁ బూర్వకవు లిట్లు వర్ణించిరి—

"ఉ॥ లాలితశౌర్యశక్తి నన ♦ లక్షుతెనుంగు దళంబు నాజిలోఁ
ద్రోలిన పాండ్య భూవిభుని ♦ తోడి పెనంకువ కోర్చి సన్నుతిఁ
గ్రాలి ప్రతాపరుద్ర సభ ♦ వర్ణనకెక్కిన యెఱ్ఱదాచ భూ
పాలసుతుండు సింగని క♦భంగుని కేబిరుదైనఁ జెల్లదే."

"ఉ॥ దాచయసింగభూవిభుని ♦ దాడికి నోడి యరాతిసంఘముల్
వేచని యీరముల్ పొదలు ♦ వృక్షచయంబులు దూఱ మేనులఁ
దోఁచిన కంటకక్షతులు ♦ తోయజలోచన లాగ్రహంబుతోఁ
జూచి నిజేశులం దగిలి ♦ చూతురు పాయక దూఱు చుగ్రతఁ"

ఈనృపాలుని రాజ్యకాలము క్రీ॥ శ॥ పదునాలవశతాబ్దపూర్వభాగమైయుండును. ద్వితీయప్రతాపరుద్రు ననంతరమునఁ గొంతకాల

* సింగభూపతి రాజ్యకాలమునఁ దలవంచుకొనువారి కౌన్నత్యము తలయెత్తిన వారికి నమ్రభావమును గలుగుచున్నది. అనఁగాఁ దన్నుఁగొలిచినవారిని గాపాడుచు గర్వించినవారిని నడంచుచుండెనని భావము.

మునకు జల్లిపల్లి యను గ్రామమునొద్ద రాచవారిసింగమ నాయని మఱదియగు చింతలపల్లి సింగమనాయని జెఱబెట్టఁగా వీరు వెళ్లి జల్లిపల్లికోటను ముట్టడించిరి. అంతఁ గోటలోని రాచవారు యుద్ధము జేయ వెఱచి తమ్మళ బ్రహ్మణీయుఁడను మాయావిని బంపి మోసమున వీనిని జంపించిరి. స్నేహభావమునవచ్చిన బ్రహ్మణీయుని యొక్క బాకుపోటు దిని సింగమనాయఁడు తన్ను మోసమునఁ జంపించిన శత్రురాజుల రక్తముతోఁ దనకుఁ దిలతర్పణము జేయుఁడని కుమారులతోఁ జెప్పి స్వర్గస్థుఁడయ్యెను. వీరిసోదరు లిరువురును ననేకయుద్ధములలో జయశీలురై పెక్కుబిరుదంబుల నందియుండిరి. వీరిం గూర్చి—

“చ॥ అగణితకీర్తిశాలి సుగు ♦ ణాకరుఁ డాచయవెన్నమోని బ
ల్పగతురు కొండలెక్కఁ దమ ♦ భామలకోమలదేహదీధితుల్
మిగుల గుహాంతరంబులఁ ద ♦ మిస్రముఁ బాపినఁ దమ్ముగాంతురన్
దిగులునఁ గస్తురిన్ వెదకి ♦ నెత్తురు మేనులమెత్త నత్తఱిన్.”

“చ॥ పగతుల కెల్లఁ దాచ నర ♦ పాలుని యాచఁడు దాఁగినెట్టుచో
మొగువనిచేతులున్ దిగులు ♦ ముట్టనిగుండెలు కొంకిముండ్లలం
దగులని మేనులున్ బిరుద ♦ దాఁచని యొమ్ములు మాఱుదేశముల్
నిగుడనికాళ్లు పూరి కబ ♦ ళింపనినోళ్లును గల్గ నెంచులన్.”

సింగమనాయనికి ‘అనపోతానాయఁడు, మాదానాయఁడు’ అను నిరువురు పుత్రులుగలరు. వీరిరువురును జల్లిపల్లికోటను ముట్టడించి పగతురంబరిమార్చి తదీయరక్తంబుచేఁ బితృతర్పణంబుగావించి తండ్రికోర్కె నెఱవేర్చిరి. వీరు క్రీ॥ శ॥ 1380 వ సంవత్సరములో నుండినట్లు శాసనాదులు గలవు.

తదనంతరమున వీరు విజిగీషులై యినుకుర్తికోటను ముట్టడింపఁగాఁ గొండరాఘవరాజు, కొండ్రాజు, జగ్గరాజు, గోవిందరాజు మున్నగు రాచవారు నూటొక్క రఘుడాలకులయఱువదివేల బలంబులఁ గూర్చుకొని యనపోతానాయక మాదానాయకులను గదియుగా సోదరులిరు



వురును ధీరులై 60,000 కాల్బలమును, 20,000 తురగములును, 7,000 గజములును, 10,000 సర్దారులైన పద్మజులును గల గొప్ప సైన్యముతోఁ బోరుసలిపి శత్రుమూకలఁ బాఱఁద్రోలి క్రీ॥శ॥ 1361 వ సంవత్సరమున జయమునుగాంచి తమ్ముఁడైన మాదానాయని దేవరకొండ రాజధాని నుండఁజేసి తాను—“రాజా సరాజాచలనామధేయా! మధ్యాస్తవంశక్రమరాజధానీమ్”అనునట్లు వంశపరంపరాగతమైన రాచకొండరాజధానియందుండి రాజ్యంబమందానందంబున నేలుచుండెను.

ఈ రాజధాని హైద్రాబాదు రాజ్యమునకుఁ జేరిన నల్లకొండ మండలములోని ప్రస్తుత నారాయణపుర సంస్థానమునకుఁ బశ్చిమమున నాలుమైళ్ళదూరమునను హైద్రాబాదునకుఁ దూర్పుగా ముప్పదిమైళ్ళ దూరమునను గలదు.

శ్రీమదనపోతానాయ మాదానాయలు దిగ్విజయయాత్రకుఁ జనుచు నోరుగంటికి దక్షిణభాగమున నైదుక్రోసులదూరమున నున్న యయ్యనప్రోలుగ్రామమును నాగ్రామముననుండు మైలారస్వామికిచ్చిన శాలివాహనశకము 1291 సం॥ నాఁటిదాన శాసనమునందు వీరు ఓరుగల్లు, భువనగిరి, సింగపురము, రాజకొండ మున్నగు నాంధ్రదేశములఁ బాలించినట్లున్నది. ఆ వివర మిట్లుగలదు—

‘స్వస్తిశ్రీమన్మహామండలేశ్వర రేచర్లగోత్రచింతామణి గజదళవిభాళభుజబలభీమ ఖడ్గనారాయణ ... ... ... ... ... ... ... జగత్ప్రసిద్ధ బిరుదనామధేయ ప్రశస్తిసహితులైన శ్రీ సింగమనాయని అనపోతానాయనింగారు ఓరుగల్లు, శ్రీభువనగిరి, రాచకొండ, సింగపురము మొదలైన తెనుంగుదేశ మాచంద్రతారాకముత్తరోత్తరాభివృద్ధిగను ధర్మరాజ్యముచేయుచును దిగ్విజయయాత్రాప్రసంగానను ఓరుగంటిదక్షిణాన అయ్యనప్రోలి తీర్థస్వామియైన శ్రీ మైలారదేవరను దర్శించి ఆ అయ్యనప్రోలు అనెడి గ్రామము మైలారదేవరకు అంగరంగభోగాది సకలసమారాధనసామగ్రి యెల్ల

వేళలందును సమకూరునట్లుగాను శకవర్షంబులు 1291 అగుచున్న సౌమ్యసంవత్సర శ్రావణశుద్ధ పంచదశీ శనివారమునాడు పవిత్రారోహణమహోత్సవ పుణ్యసమయమందు అష్టభోగసహితముగాను సమర్పించి చేసిన దిగ్విభాగ మెట్లన్నను ... ... ”

వీరి సోదరుఁడగు మాదానాయఁడు శ్రీశైలమునకు సోపానములను గొంతవఱకు గోపుర మండపప్రాకారములను శ్రీశైలోత్తరద్వారమైన యుమామహేశ్వరక్షేత్రములో నాచంద్రార్కముగ దృఢమైన శిలామండపమును గట్టించినట్టు లాదేవాలయసమీపవితర్దిపై శాలివాహనశకము 1298 (క్రీ॥ శ॥ 1376) వ సంవత్సరమున స్థాపింపఁబడిన శిలాశాసనమునఁ దెలియఁగలదు. అందు—

“శ్లో॥ దన్త్యబ్జార్కశకాబ్దశాలిని శివే వర్షేనభే ఫాల్గునే
మాచేదాచయ సింగభూపతిసుత శ్రీమాధవో భూధవః
శ్రీశైలోత్తరతోరణే భువి మహేశస్యాలయం నూతనం
పాషాణై స్సుదృఢం సురాసురనుతం గమ్యమ్ముదా చీకరత్॥”

అని కలదు. ఈ మాదానాయనింగారికి పుత్రుఁడు పెదవేదగిరినాయఁడు; పౌత్రులు రామచంద్రనాయఁడు, కుమారమాదానాయఁడు; ప్రపౌత్రులు సూరానాయఁడు, కుమారవేదగిరినాయఁడు, లింగమనాయఁడు అనువారుగలరు. వీరిలో లింగమనాయఁడు తనయన్నను సంహరించిన యనవేమారెడ్డిని వధించి యాతని ప్రతిరూపమును దమ తమ్మపడిగయందుఁ జెక్కించుకొనుటయేగాక వాని వంశబిరుదముగాఁ బ్రసిద్ధమైన ‘నందికంతపోతురాజు’ అను కఠారిని గైకొని వచ్చెను. అనవేమారెడ్డి తమ్ముఁడైన వీరభద్రారెడ్డి లోనగువార లీకఠారిని మఱల సంపాదింపనెంచి యాస్థానకవియగు శ్రీనాథుని బంపిరి. ఆ కవి లింగమనాయని యాస్థానంబునకుఁబోయి—

“సీ॥ జగమెబ్బగండాంక ♦ సంగ్రామనిశ్శంక
జయమొందురాజ వే ♦ శ్యాభుజంగ
యవనికోటలగొంగ ♦ యరిరాజమదభంగ
మేలంపుధరణీశ ♦ మీనజాల
మూరురాయరగండ ♦ మురియురాజులమిండ
యభివృద్ధిసేయుఁ జే ♦ హస్తిమల్ల
ఘనగాయగోవాళ ♦ కామినీపాంచాల
సిరిగల్గు శశివాశ ♦ పరశురామ

తే॥ గీ॥ దండిబిరుదుల సురథాను ♦ గుండెదిగుల
బళిర యల్లయ వేమభూ ♦ పతికి మిండ
రమణమించిన మేదినీ ♦ రావుబిరుద
సంగరాటోప మాదయ ♦ లింగభూప॥

ఉ॥ బల్లరగండ లింగవిభు ♦ పాదమునంటుఁ బసిండియందె దా
గల్లురు గల్లుగల్లురని ♦ గల్లని మ్రోయఁగ భీతి గుండియల్
జల్లురు జల్లుజల్లురని ♦ జల్లన నల్లలనాడుచుండు రా
యల్లయరెడ్డి వేమనృపుఁ ♦ డాతనితమ్ముఁడు వీరభద్రుఁడున్॥

ఉ॥ వాదులు వాదవిద్యల సు ♦ వర్ణముగాంచుటయద్భుతంబె యీ
మాదయలింగభూవిభుని ♦ మార్కొని యల్లయవీరభద్రుఁడున్
వాదముఁజేయ దేహము సు ♦ వర్ణమయంబయి వానియందియున్
ఖేదముదక్కియుండెఁ దల ♦ క్రిందయి వ్రేలుచు విఱ్ఱవీగుచున్॥”

అని స్తుతించి పారితోషికముగ నాకఠారిని మఱికొంతధనమును గైకొనియె.

ఈలింగమనాయఁడు పెక్కుయుద్ధములు జేసి జయించి యనేకబిరుదముల నందియుండెను. ఇఁకఁ గథాంశమునకు వత్తము.

ఆఱవతరములోనివారగు ననపోతానాయనికి పెదసింగమనాయఁడు, ధర్మానాయఁడు నను నిరువురు పుత్రులుగలరు. వీరిలో జ్యేష్ఠుఁ

డగు సింగభూపతి 'రసార్ణవసుధాకర' మను నామాంతరముగల 'సింగభూపాలీయ' మను నలంకారశాస్త్రమును, సంగీతరత్నాకరవ్యాఖ్యను, మఱికొన్ని సంస్కృతగ్రంథములను రచించి 'సర్వజ్ఞ' బిరుదమునందినట్లు విస్పష్టము. వీరికింగల యార్గురుపుత్రులలోఁ జినసింగమనాయని (వేదగిరినాయఁడు)కనపోతానాయఁడను పుత్రుఁడుగలఁడు. వీనిమువ్వురు పుత్రులలో సర్వజ్ఞసింగమనాయఁడగ్రజుఁడు. ప్రథమసర్వజ్ఞసింగభూపతి కీయన ప్రపౌత్రుఁడగును. ఈసర్వజ్ఞసింగభూపాలుఁడు మహాపండితుఁడైయుంటచే వీరినివర్ణింపఁబోయిన శ్రీనాథుఁడు తన కేమిపరాభవము గల్గునోయని చింతించి వాగ్దేవి నిట్లు ప్రార్థించెను.—

"సీ॥ దీనారటంకాలఁ ♦ దీర్థ మాడించితి
దక్షిణాధీశు ము♦త్యాలశాల
పలుకుతోడై తాంధ్ర♦భాషామహాకావ్య
నైషధగ్రంథ సం♦దర్భమునకు
పగులఁగొట్టించి తు♦ద్భటవివాదప్రౌఢి
గౌడ డిండిమభట్టు ♦ కంచుఢక్క
చంద్రశేఖరక్రియా♦శక్తి రాయలయొద్దఁ
బాహాళొల్పితి సార్వ♦భౌమబిరుద

తే॥గీ॥ యెటులమెప్పించెదో నన్ను♦నింకమీఁద
రావుసింగన్నభూపాలు ♦ కవిశాలు
నింపుకొలువున నెలకొనియుండ సివు
సరససద్గుణనికురంబ ♦ శారదాంబ॥"

ఈపండితప్రభువే బమ్మెరపోతనామాత్యకృతభోగినీదండకకృతిపతియని యీదిగువ పద్యమువలనఁ దెలియునగును.

"ఉ॥ పండితకీర్తనీయుఁ డగు ♦ బమ్మెరపోతన యాసుధాంశుమా
ర్తాండకులాచలాంబునిధి ♦ తారకమై విలసిల్లు భోగినీ
దండకమున్ రచించె బహు♦దానవిహర్తకు రావుసింగభూ
మండలభర్తకున్ విమత♦మానవనాథమదాపహర్తకున్॥"



ఇంకఁ బ్రకృతమనుసరింతము. ఏడవతరములోని ధర్మానాయనకుఁ దిమ్మానాయఁడను పుత్రుఁడును మఱికొందఱును గలరు. వీరు క్రీ॥ శ॥ 1426 వ సం॥ ప్రాంతములో నుండిరి.

ఈతిమ్మానాయనికి పుత్రులు ధర్మానాయఁడు, చిట్టిదాచానాయఁడు అనువారుగలరు. వీరిలోఁ జిట్టిదాచానాయనిసుతుఁడు 'అనపోతానాయఁడు. వీనిపుత్రుఁడు చిన్నమాదానాయఁడు. ఈచిన్నమాదానాయనిపుత్రులు—ఎఱ్ఱసూరానాయఁడు నల్లసూరానాయఁడు. ఈనల్లసూరానాయని సంతతివారు మైలవరమువారగు సూరానేనివారైరి.

ఎఱ్ఱసూరానాయనికి మాదానాయఁడు, యాచమనాయఁడను నిరువురుసుతులు గలరు. ఈమాదానాయనిసంతతివారు ప్రోలునాటివారైరి. వీరే సురభివారికి మూలపురుషులు. రెండవవాఁడైన యాచమనాయని సంతతివారే వెలుగోటిశాఖవారు.

రేచర్లగోత్రజులలో ననేకశాఖాభేదంబు లేర్పడియుండినను నీ వెలుగోటిశాఖయే ప్రధానశాఖగఁ బ్రసిద్ధిగలిగియుండుటకుఁ గొన్ని కారణములు గలవు. అవేవనఁగా సార్వభౌముండగు కాకతిగణపతిదేవుండు వీరిమూలపురుషుండగు భేతాళనాయనికి బహుమతిగానిచ్చిన చౌకళికత్తియు, భేతాళనాయఁడు తనధైర్యపరీక్షకై భేతాళుఁడు ఘోరాకృతితోఁ బ్రత్యక్షమైనప్పుడు తద్గృహము మీఁది కెత్తినకత్తియుద్వితీయప్రతాపరుద్రుఁడు నాల్గవతరమువాఁడైన యెఱ్ఱదాచానాయని కిచ్చిన పాండ్యరాజజయలబ్ధమగు స్వర్ణసింహాసనము మున్నగుననియు నిప్పటివఱకు నీశాఖవారియొద్ద నేయుండుట—సార్వభౌములుగానున్న విజయనగరాధిపుల సన్నిధినేయుండి వారివలన బలుమారు శత్రురాజులపైకిబంపఁబడుచు వారికి సాహాయులుగా నుండుటయు నైయున్నవి.

ఈయాచమనాయనికి చిన'సింగమనాయఁడు' అను పుత్రుఁడు గలఁడు. వీనికి నిర్వాణరాయప్పనాయఁడు జనించెను. వీరికి పెద్దరాయఁడను నామాంతరము గలదు. ఈనృపాలుఁడు వంశపరంపరాగతమైన

దేవరకొండరాజ్యమును క్రీ॥ శ॥ 16 వ శతాబ్దిని నేలుచుండెను. ఆకాలమున సకలజగజ్జేగీయమానప్రతాపసముపేతుండైన శ్రీకృష్ణదేవరాయభూతలేంద్రుఁడు విజయనగరరాజ్యాధీశ్వరుండై యుండెను. అప్పుడొక తురుష్కుఁడు విశేషసేనాసమేతుఁడై వెలుగోడురాజ్యము నాక్రమించి కృష్ణదేవరాయల నెదిరింపఁజూచుచుండెను. ఈవృత్తాంతమును రాయలవారి సామంతుఁడైయున్న నిర్వాణరాయప్పనాయఁడువిని వాని నిర్జించిన రాయలవారిచే మెప్పొందనగునని యెంచి యప్పటికిగల స్వల్పసైన్యముతో నాతురుష్కునిపైఁ బడి వాని నత్యద్భుతపరాక్రమమున జయించి తద్రాజధానిని నాక్రమించి వాని ప్రధానబిరుదమగు శ్వేతచ్ఛత్రము నాకోటపైఁ బట్టించుకొనెను.

ఈవృత్తాంతము రాయలవారికెఱుకపడఁగా నానందభరితుఁడై యానిర్వాణరాయప్పనాయనివారిం రావించి యధికగౌరవముతో 'వెలిగోడుగురాయవిభుఁ' డను బిరుదమిచ్చి జయలబ్ధమైన యీవెలుగోడు రాజ్యము నేలుచుండుమని యానతిచ్చి పంపించెను.

అంత నీవీరాగ్రణి యీవెలుగోడురాజధానిలో వసించి యందుఁ బూర్వమున్నకోటను బలపఱచి యనతిదూరమునఁ బర్వతప్రాంతమున పరరాజుల కభేద్యమగు నొకబలిష్ఠమైనకోటను యుద్ధసమయంబులం దంతఃపురజనావాసంబున కర్హంబులగు సౌధరాజంబులను ధనాగారకోశాగారాదిరాజభవనములను బెక్కింటిని గట్టించి రాయలవారి సేనాగ్రయాయియై వెలయుచుండెను. నాఁటనుండి యీశాఖవారు * వెలుగోటివారని వ్యవహరింపఁబడుచుండిరి.

ఈవెలుగోడు కర్నూలుజిల్లాలోని నందికొట్కూరుతాలూకాలోఁ జేరి కర్నూలునకుఁ దూర్పున 40 మైళ్ళదూరమునను నంద్యాలకుత్తరమున 15 మైళ్ళదూరమునను శ్రీశైలమునకు దక్షిణమున 40 మైళ్ళదూరమునను గలదు. ఈ రాజధానిలోఁగల కోట శిథిలముగాఁగ నందున్న శివాలయమునాతయుఁ దీసి గ్రామములోఁ గేశవాలయముగ నీవలివా రెవరో నిర్మించి యుంచిరి. కోటలోఁగల సింహాసనమునుగూడ

* రాయలవారి పట్టాభిషేకమునకే వెలుగోటివారున్నట్లు 'ధాటీనీరావార ఘోటీహతవిరోధి కోటులైవెల్గు వెల్గోటివారు' అని కుమారధూర్జటి చెప్పుచున్నాఁడు



సీయాలయమందలి కల్యాణమండపములో నుంచిరి. అది కురువిందశిలామయమై యాఱుగులనిడివి నాలుగడుగులవెడల్పు మూఁడడుగుల యెత్తు గలిగి ద్వాత్రింశత్సాలభంజికాయుక్తముగ నున్నది. నలుదిక్కుల సింహములుగలవు. దానిగర్భ మంతయు బలముగా నుండి దానిలో జలము నింపుటకు దీయుటకు సూక్ష్మరంధ్రములు గలిగియుండెను. వేసవికాలములో జలమునింపి దానిపై రాజులు గూర్చుండెదరు. ఢిల్లీలోని సింహాసనమును హైదరాబాదులోఁగల యక్కన్న మాదన్నగార్ల సింహాసనములు నిర్విధముగానే యుండెనఁట.

ఈ నిర్వాణరాయప్పనాయఁడుగారికి గల నలువురు కుమారులలోఁ దృతీయుఁడయిన కుమారతిమ్మానాయఁడు వంశప్రవర్తకుఁ డయ్యెను. ఈయన వెలుగోటిలోనుండి యాదేశము నేలుచు ననేకములైన దేవాలయములు స్థాపించినట్లు దెలియుచుండెను.

ఈ కుమారతిమ్మానాయనికి పెదకొండప్పనాయఁడు, తిమ్మానాయఁడు, పినకొండప్పనాయఁడు' అను మువ్వురుపుత్రులు గలరు. వీరిలోఁ ద్వితీయుఁడైన తిమ్మానాయఁడు శ్రీశైలమునొద్ద ప్రభుత్వము జేయుచుఁ బెక్కుయుద్ధములను జేసియుండినట్లు చరిత్రములందు గలదు. మల్లాపురమునొద్ద (క్రీ॥ శ॥ 1530) శాలివాహనశకము 1452 విరోధి సంవత్సర భాద్రపద శు 8 ఆదిత్యవారమున జరిగిన గొప్పయుద్ధములో జయ మందెను గాని మఱికొంతకాలమునఁ గావళి యోబళరాజుచేఁ జిక్కి సంహరింపఁబడెను.

తృతీయుఁడైన పినకొండప్పనాయనికి ముగ్వురుభార్యలు గలరు. వారిలో ద్వితీయభార్యయైన యక్కమ్మయందు జనించిన యాచమనాయఁడు ప్రస్తుత కథానాయకపురుషుఁడు.

ప్రథమభార్యాచతుర్థపుత్రునకు వెంకటాద్రినాయఁడను సుతుఁడు గలఁడు. ఆయన 'కలిమిలి' యనుగ్రామమును గొబ్బూరువారినుండి జయించి యాగ్రామమునకు దన నామధేయమువచ్చునట్లు వేంకటగిరి

యను పేరుంచెను. ఇదే వెలుగోటివారి రాజధానియగుటచే నాఁటనుండి వేంకటగిరివారని వ్యవహరింపఁబడు చుండిరి. ఈ వెంకటాద్రినాయని కుమారుఁడగు రాయప్పనాయఁడే వేటూరి రంగరాజకృత 'భానుమతీపరిణయ'కృతిభర్త. ఏతద్గ్రంథకాలమును గుఱించి వీరేశలింగకవికృత 'కవిజీవితములో'—"గోలకొండమహమ్మదీయులను గొండసీమ, వినుకొండప్రభువులను జయించి శాలివాహనశకము 1579 సంవత్సరమునందు విజయనగరరాజులపక్షమునఁ బోరాడి విపక్షరాజబృందము నోడించిన కస్తూరి రంగప్పనాయనికిఁ గృతిపతియైన యీ రాయభూపతి పెదతండ్రిమనమఁడు. భానుమతీపరిణయమును గృతినందునప్పటికి రాయభూపతికి యుక్తవయస్సువచ్చిన కొడుకులుండుటచేత గ్రంథరచన జేసిన కాలము క్రీ॥ శ॥ 1620 సంవత్సరప్రాంతమని చెప్పవచ్చును" అని యున్నది. మఱియు నీ రాయభూపతి శ్రీ శ్వేతాచలనాథుని ధ్వజమునకు బంగరుతొడుపు చేయించినట్లు—

"ప్రద్యోతిత శ్వేతాచలపుండరీకాక్ష ధ్వజస్తంభవిజృంభమాణ హాటకపాటవాటోప వైభవుండును" అని భానుమతీపరిణయమునందు వర్ణింపఁబడియుండెను.

ప్రస్తుతకథానాయకపురుషుఁడని చెప్పఁబడిన యాచమనాయనికి కస్తూరి రంగప్పనాయఁడు, ఆకుపీటి తిమ్మానాయఁడు, అను నిర్వురు పుత్రులుగలరు. ఈ తిమ్మానాయఁడు నంద్యాల తాలూకాలోని యాకుపీటిలో రాజ్యము జేసినందున నాకుపీటి తిమ్మానాయఁడని పేరుగలిగెను. సారె యోబళరాజు రాజ్యమునాక్రమించుకొనిన మట్లసీమ దొరయైన తిమ్మరాజుపైకి కస్తూరి రంగప్పనాయఁడు దాడివెడలి జయించి వానిరాజ్యము వానికి శాలివాహనశకము 1501 (క్రీ॥ శ॥ 1579) ప్రమాదిసం॥ర ఆశ్వయుజ శు 8 ఆదివారమున నొసంగి పరాక్రమశాలియని పేరొందెను. వీని విక్రమమును గుఱించి యిట్లు వర్ణింపబడియుండెను—

సీ॥ జంభారిదోస్తంభ ♦ గంభీరనినదోగ్ర
దంభోళిధారకుఁ ♦ దాళవచ్చు
దుర్వారమదదంతి ♦ గర్వాపహాతిబొంగు
సింగఁపుఁగొదమను ♦ జెనకవచ్చు
గబ్బియై యాఁబోతుఁ ♦ గన్గొని యుబ్బెడు
బెబ్బులినైనను ♦ గెబ్బవచ్చు
శూలాయుధానల ♦ జ్వాలామహాభీల
కాలభైరవునైనఁ ♦ గదియవచ్చుఁ

తే॥ గీ॥ గాక సిన్నాజిలోపలఁ ♦ గదిసి మొనసి
నిలిచిపోరాడలేక పే ♦ రులికి వైరు
లమరఁ దమపురి విడిచి రా♦రార సమద
విమతమదభంగ! యాచభూ♦విభునిరంగ॥"



ఈ కస్తూరి రంగప్పనాయనికి ముగ్వురు కుమారులుగలరు. వారిలో యాచశూరుఁడను నామాంతరముగల పెదయాచమనాయఁడు. ద్వితీయుఁడు.

వీరికాలములో జరిగిన యొక మహత్తరవిషయమును గుఱించి సువెల్ దొరగారు రచించిన విజయనగరచరిత్రము 17వ అధ్యాయము 225 వ పేజీలో వివరముగ వ్రాయఁబడియుండెను. ఆ విషయసంగ్రహ మిద్ది—"విజయనగరాధిపుఁడైన వేంకటరాయలు చంద్రగిరిలో 1586 మొదలు 1614 వఱకు రాజ్యపాలన మొనరించెను. ఈయన జ్యేష్ఠభార్యయు జగ్గారాయని చెల్లెలునైన బాయమ్మ తనకు సంతతిలేనందున నొక బ్రాహ్మణశిశువును దానుగన్నట్లు వెల్లడిపఱిచి పెంచుకొనుచుండెను. ఈసంగతి నెఱింగియుంటచే వేంకటరాయలు దన యవసానకాలమున రాజ్యమును కృత్రిమపుత్రుఁడైన నీబాలునికిగాక తనయన్నకుమారుఁడైన మూఁడవరంగరాజున కిచ్చి గతించెను. వీరిభార్యలిరువురును సహగమన మొనరించిరి.

అనంతరమున నీరంగరాజును రాజుగా నంగీకరింపక, జగ్గరాజు తన కృత్రిమపుమేనల్లుని రాజుగాఁజేయ నిశ్చయించుకొనెను. దళవాయి

యు, మంత్రియు నిందుల కంగీకరించి రంగరాజును సకుటుంబముగాఁ జెఱయం దుంచి జగ్గరాయని కపటపు మేనల్లుఁడైన చిక్కరాజును రాజుగాఁ జేసిరి. ఇదియంతయు నన్యాయమని మన యాచమనాయఁడు వీరి చర్యల కంగీకరింపక చెఱలోనుండిన రాచవారిని విడిపించుటకై పెక్కు ప్రయత్నములు జేసెనుగాని యవియన్నియు నిష్ఫలములయ్యెను. అంత గుడ్డలకై లోపలికిఁబోవుచున్న చాకలివానివలన శ్రీ రంగరాయలవారి ముగ్గురుకుమారులలో 12 సం॥ వయస్సుగల మధ్యముని గుడ్డలమూటలోఁ గట్టించి తప్పించుకొనెను. ఇట్లు రాచకుమారుఁడు యాచమనాయనిఁ జేరినపిమ్మటఁ బ్రతిపక్షుని సేనానులలో నల్వురు 8 వేల సైనికులతో వచ్చి యాచమనాయని గలిసికొనిరి."

"అంతఁ జెఱనుండి శ్రీరంగరాయలవారిని దప్పించుటకు మఱొక ప్రయత్నము సేయఁబడెను. కాని యదియుఁ బయల్పడుటయగాక చెఱలోనివారు సకుటుంబముగా నఱకుకొని చచ్చునట్లయ్యెను. ఇందువలన యాచమనాయనికడనున్న రెండవకుమారుఁడుదప్ప నెల్లరు నశించిరి. ఈ క్రూరకృత్యమున కడలి మఱికొందఱుముఖ్యులు యాచమనాయని జేరిరి. అంత యాచమనాయఁడు దాడివెడలఁగా జగ్గారాయఁడు పాఱిపోయెను. అప్పుడు యాచమనాయఁడు జగ్గారాయనిడేరాలోఁ బ్రవేశించి ముసలిరాజునకు సంబంధించిన కిరీటము మున్నగు రాజచిహ్నములఁ గైకొని రంగారాయని కుమారున కిచ్చి విజయనగరాధిపతిగఁ బ్రకటించెను." ఈవిషయము పోర్చుగల్ రాజధానియైన లిజ్బన్ పట్టణపు రికార్డులోఁ దమకు లభించెనని సువెల్ దొరగారు వ్రాసిరి.

ఈ యాచమనాయనిగుఱించి కాళహస్తి ప్రభువైన దామెర వెంగళభూపాలవిరచితమైన 'బహుళాశ్వచరిత్రము'లో నిట్లువర్ణింపఁబడి యుండెను.

"సీ॥ ఉత్తరమల్లూరి ♦ యొద్ద దావలపాప
విభునిగొట్టిననాఁటి ♦ విజయకలన
తిరుమల జేరి ధా♦త్రిని మన్నె రాజులఁ
బాఱఁ ద్రోలిననాఁటి ♦ బాహుబలము
చెంగలుపట్టు వీ♦క్షించి లగ్గలుపట్టి
యాక్రమించిననాఁటి ♦ విక్రమంబు
పాళెముకోట వె♦ల్పల నాజి యతిరాజు
జరగఁ జేసిననాఁటి ♦ శౌర్యపటిమ

తే॥ మున్నె లో పూరు జగ్గరా♦ణ్ముఖులగెల్చి
మధురదొర చెంజి మన్నని ♦ మద మడంచి
తిరుచునాపల్లి దొరఁ దోలు ♦ తేజముగల
మేటివెలుగోటియాచని ♦ సాటిగలఁడె."



ఈ యాచశూరున కెనమండుగురు కుమారులుగలరు. వారిలో నాలవవాఁడు కుమారయాచమనాయఁడు. వీనికి బంగారుయాచమనాయఁడను సుతుఁడు గలఁడు.

చెంజిదుర్గాధిపతియైన సూరపసింగ్ అనునతఁడు ప్రతిఘటించి కప్పముగట్టక తిరుగబాటుచేసినందున వీని నణచుటకై ఆలంఘీర్ పాదుషా తన వజీరుఁడగు అసత్ఖాన్ బహాదరుకుమారుఁడైన జుల్ఫకారుఖాన్ బహాదరును గొప్పసేనతో నార్కాడుసుబాకు బంపించెను, గాని యతఁడార్కాడునకు వచ్చియు శత్రువుల వశపఱచుకొనక యుపేక్షించి యుండెను. ఇందునకు బాదుషావారాగ్రహించి జాబులు వ్రాయుచుండిరఁట. ఈవిషయము 'తుహ్ఫాతుల్ అక్బార్' అనుగ్రంథమందు గలదు.

పిదప బాదుషాగారు దక్షిణదేశమునకువచ్చినప్పుడు వినయవిధేయతలుజూపిన శౌర్యశాలియగు యాచమనాయఁ డార్కాడుసుబాకు దగినవాఁడని యెంచుటను విని జుల్ఫకారు వెంటనే యుత్తరమల్లూరునకుబోయి యాచమనాయని స్నేహభావముతోఁ దన డేరాకుఁ బిలిపించుకొని సంభాషించుచుఁ దాను బైటకువచ్చి యకస్మాత్తుగ నా డేరా త్రాళ్ళను గోయించి డేరా వానిపైఁ గూలద్రోయించి చంపించెను.

వీరి ముప్వురుభార్యలును ముప్వురుకుమార్తెలును దురుష్క పరిభవభీతికి వెఱచి యాత్మహత్య గావించుకొనిరి. సంస్థానములోని ధనకనకవస్తువాహనాందోళికలు, ఛత్రచామరములు నేగాక నాల్గవతరములోని యెఱ్ఱదాచానాయనికి జయలబ్ధమైన స్వర్ణసింహాసనమును దురుష్కులపాలాయెను. ఇందువల్లనే సంస్థానములో భేతాళనాయనినాఁటనుండి లభ్యమైన ఫర్మానాలంతరించుటయు, వీరిపుత్రులనాఁటనుండి పొందఁబడినవి యుండుటయు నని యెఱుఁగునది.

ఆవిప్లవమునుండి తప్పింపఁబడిన వీరిపుత్రులగు సర్వజ్ఞకుమారయాచమనాయఁడు కుమారనాయఁడు నను నిరువురుపుత్రులును సురక్షితులై సాఘుగడనేలుచున్న జూపల్లి రామానాయుని చెంతఁ జేరిరి. వారి విషయమును షాహుసాహుఁ దెలుపఁ బ్రయత్నించుచుండఁగా జుల్ఫకారుఖాన్ వెఱచి సంధికివచ్చి షాహుసాహు గొన్నియనృతవార్తలఁబంపి తుదకు 10,13,04,625 దాములు (దాము అనఁగా రూపాయిలో 40 వ భాగము) శిస్తురాఁదగిన సర్వాపల్లి, నెల్లూరు, వేంకటగిరి, కాళహస్తి, గూడూరు, తిరుపతి, విష్ణుకంచి, పూనమల్లి, మఱికొన్ని తాలూకాలను జాగీరుగాను వీరితండ్రిగారికున్న షష్హజారీమన్సబ్‌ను, షష్హజారీ సవార్లమన్సబ్‌ను నిచ్చితిమని పాదుషావారిచే జులూసీసన్ 37 గల సన్నదును నిప్పించి, వారిని వేంకటగిరిలో నివసించునట్లు చేసెను. అట్లు జరిగినపిమ్మట జ్యేష్ఠుఁడగు సర్వజ్ఞకుమారయాచమనాయఁడు క్రీ॥ శ॥ 1695 సం॥లోఁ బట్టాభిషిక్తుఁడయ్యెను.

అంతఁ గొంతకాలమునకు సోదరుఁడగు కుమారనాయనికి 1,67,25,000 దాములశిస్తురాఁగల దూపాడు, ఉదయగిరి, అద్దంకి, పొదిలె, దర్శి, కారెంపూడి, పెళ్లూరు, ఆరికట్ల, కొచ్చెర్లకోట అనుపరగణాలను నిచ్చినట్లు జూలూసీసన్ 43 గలసన్నదు నార్కాడు నబాబిప్పించెను; గాని యాయన యపుత్రసంతుఁడగుటచే నివియు వానియనంతరమున సోదరుఁడగు సర్వజ్ఞకుమారయాచమనాయునికే లభ్యమయ్యెను. ఈసర్వజ్ఞకుమారయాచమనాయఁడుగారు సంస్కృతపండితులై శ్రీ



కాళహస్తి జ్ఞానప్రసూనాంబికపై నొకయష్టకమును నొకచూర్ణికను రచించిరి. విష్ణుపురాణమును బద్యకావ్యముగ ముడుంబి అప్పయ్యదీక్షితునిచే నాంధ్రీకరింపఁ జేసిరి. వీరు ముప్పదినాలుగు గ్రామముల నగ్రహారములుగ నిచ్చిన ట్లాయాగ్రామములును గాలక్రమమును వెలుగోటివారి వంశచరిత్రమునందు వివరముగాఁ గలదు.

ఇట్లు మహావిభవముతోను ధర్మైకరతితోను నేబదినాలుగు సంవత్సరములు ప్రభుత్వము జేసి వీరు క్రీ॥ శ॥ 1748 సం॥లోఁ బరమపదము నొందిరి.

వీరికి బంగారుయాచమనాయఁడు, పెద్దయాచమనాయఁడు నను నిరువురు పుత్రులుగలరు. వీ రిరువురకును బరస్పరకలహములు జరుగుచుండెను గాని యనుజుని యనంతరమున బంగారుయాచమనాయఁ డార్కాడుసుబానబాబైన వాలాజాబహద్దరువారి మొహరుతో 1167 హిజరీగల సన్నదును, ఢిల్లీపాదుషాగారి నజీరు మొహరుతో 1169 హిజరీగల సన్నదునుబొంది క్రీ॥ శ॥ 1755 లోఁ బట్టాభిషిక్తుఁడై యార్కాడువారికిని, హైదరాబాదువారికిని యుద్ధాదులలోఁ దోడ్పడుచుండెను.

వీరు ఢిల్లీపాదుషావారిచే ననేకములైన రాజసన్మానములను బొందియుండిరి. వేంకటగిరిలోఁగల కాశీవిశ్వేశ్వరాలయమును వీరే కట్టించిరి. ఇందు క్రీ॥ శ॥ 1760 సం॥లోఁ బ్రతిష్ఠగావింపఁబడెను. మఱియు రాజసౌధములు, నగరులు, తటాకములు, సత్రములు, మున్నగునవెన్నియో కట్టించిరి. వీరు ముప్పదిగ్రామములవఱకు నగ్రహారములుగ దత్తముగావించినవివరము వెలుగోటివారివంశచరిత్రము నందు గలదు.

తమకు సంతానములేనందునఁ దమసన్నిహితజ్ఞాతియగు అల్వాలటివారిచిన్నవానిని దత్తునిగ స్వీకరించుకొని తండ్రిగారిపేరిడి 1776 సం॥లో స్వర్గస్థులైరి. భార్య లిరువురును సహగమన మొనరించిరి.

వీరియనంతరమున దత్తపుత్రుఁ డగున కుమారయాచమనా

యేడు రాజ్యమునకు వచ్చెను. వీరు ప్రఖ్యాతములగు ననేక కార్యముల జరిగించిరి. సంస్థానములోఁగల రథములు, మండపములు, సువర్ణవృషభవాహనము, రజితసింహవాహనము, ఆఱుస్తంభములుగల బంగారపు టంబారీ, మున్నగువానిని జేయించిరి. నగరునకు బశ్చిమభాగంబున గొప్పమసీదునుగూడఁ గట్టించిరి.

క్రీ॥ శ॥ 1790 వ సంవత్సరములో టిప్పుసుల్తాన్‌తోఁ గూడిన యుద్ధము ప్రసక్తముకాఁగా నప్పుడు సంస్థానాధిపతులందఱును నవాబువారిపక్షములోనున్న యింగ్లీషువారికి సాహాయమునకుఁ బోయియుండిరి. అక్కడ యుద్ధమునకుఁ బోవునపు డింగ్లీషువారి కూచి కాఁగానే వేంకటగిరివారి కూచి కావలసియుండఁగాఁ గాళహస్తివారు ముందుగాఁ దమ నకారాకూచి చేయింపఁగా నీకుమారయాచమనాయఁడు చెన్నపురిగవర్నరుగారికీసంగతిని దెలిపిరి. అప్పుడు గవర్నరుగా రుభయసంస్థానపు మర్యాదలను విచారించి వేంకటగిరివారి నకారాకూచియే ముందుజరుగవలసినదని తీర్మానించి వ్రాతమూలముగఁ దెలియపఱచిరి. మఱియు నీయుద్ధములో వేంకటగిరివారుచేసిన సాహాయ్యమునకు మెచ్చి గవర్నరుగారు 1790 జులై 17 తేదీగల యినాయతునామాతో వీరికి 200 తుపాకులఁ బంపిరి.

వీరికాలములోనే యార్కాటుసుబా యింగ్లీషువారి వశమగుటచే నంతవఱకు నార్కాటునబాబునకు జెల్లించుచుండిన పేష్కషుహొన్నులు 21,673 ను జంగీశిబ్బందికిబదులుగా నప్పుడేర్పఱచిన హొన్నులు మొత్తము 89,385 వెరశి 1,11,058 హొన్నులు పేష్కషుగాఁ జెల్లింపవలసినట్లు 1802 ఆగస్టు 24 తేదీగల యిస్తిమిరారు అను శాశ్వతమైన పట్టానుబొంది తదాదిగ 1,11,058 పూలవరాలను జెల్లించుచుండిరి.

వీరు వేంకటగిరి తాలూకాలోని 'పాలసముద్రము, యాతలూరు' అను గ్రామములను శ్రీకాశీవిశ్వనాథస్వామివారికిని, 'సుబ్రహ్మణ్యము' అను గ్రామమును శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికిని నిత్యపూ



జానివేదనలకై సమర్పించిరి. మఱియు డెబ్బదినాలుగు గ్రామములను నగ్రహారములుగ నిచ్చిరి.

వీరు తమ నలుబదిరెండవయేట ననఁగా (క్రీ॥ శ॥ 1804 సం॥) రక్తాక్షి సం॥ అధిక చైత్ర శు ౭ నాఁడు కైవల్య మందిరి.

వీరి యనంతరమున వీరిదత్తపుత్రుఁడగు బంగారుయాచమనాయఁడుగారు సింహాసన మధిష్ఠించిరి. వీరు మద్రాసు గవర్నరుగారైన సర్ థామస్ మన్రోగారి దర్శనము జేసి వారిచే శ్రేష్ఠమైన యొక యింగ్లీషుకత్తిని గొప్పమర్యాదలను బొందిరి. వీరు శ్రీకాశీవిశ్వనాథస్వామివారి కొక వెండియేనుఁగువాహనమును జేయించిరి. వీరు దేవస్థానములకు నెనిమిదిగ్రామములను సమర్పించిరి.

మఱియు నాల్గవతరమువాఁడైన యెఱ్ఱదాచానాయనికి జయలబ్ధమైన పచ్చ పిఠాపురముశాఖవారికి బ్రాప్తముకాఁగా దానిని మఱల బహుళధనమొసఁగి తాము విక్రయమునకుఁ దీసికొనిరి. ఈమరకత మిప్పటివఱకును సంస్థానములో ముఖ్యశిరోభూషణముగ ధరింపఁబడుచుండెను. వీరుఢిల్లీచక్రవర్తిచే నొసంగఁబడిన ఓరు దంబారీయొక్క యాకృతితోఁ బన్రెండు స్తంభములుగల యొకబంగారపుటంబారిని జేయించిరి. మఱియు వీరు ముప్పదియెనిమిది గ్రామములను దానముచేసియుండిరి.

వీరియనంతరమునఁ గుమారయాచమనాయఁడుగారు సింహాసనమునకువచ్చిరి. వీరు తమ యాస్థానపండితుఁడగు తర్కభూషణము వేంకటాచార్యులవారిచే 'శృంగారకల్పవల్లి' యను నలంకారగ్రంథమును జేయించి (క్రీ॥ శ॥ 1851) శాలివాహనశకము 1773 సం॥ సాధారణ సంవత్సరాశ్వయుజ బహుళాష్టమిని వేంకటగిరితాలూకాలోని వెదురుగుంటయను గ్రామమును సర్వాగ్రహారముగ నొసంగిరి. వీరు రామేశ్వరయాత్ర జరిగించినప్పుడు దిరువళ్లూరి వీరరాఘవస్వామివారి కొకస్వర్ణమయమైన శఠగోపమును సమర్పించిరి. శ్రీకంచి వరదరాజ

స్వామివారి గరుడవాహన హనుమద్వాహనముల వేంచేపులు తమపేర నేఁటేఁట జరుగుటకు వానికయ్యెడు వ్యయము దానిమిచ్చుట కేర్పాటు గావించియుండిరి.

వీరు గోపీనాథ వేంకటకవియనువానిచే వాల్మీకిరామాయణమును, బ్రహ్మవైవర్తపురాణమందలి శ్రీకృష్ణజన్మఖండమును, భగవద్గీతలను నాంధ్రీకరింపించి తాము కృతినంది మారెళ్ళతాలూకాలోఁ జేరిన పెరుగుపల్లిగ్రామమును క్రీ॥ శ॥ 1860 సం॥ లో బహుమతిగా నాకవీశ్వరున కొసంగిరి. వీరు కాశీయాత్రకై చని యనేకపుణ్యక్షేత్రములను దర్శించి బృందావనమునుండి శ్రీ రాధాకృష్ణస్వామివారి పాదములను, అయోధ్యనుండి శ్రీసీతారాములవారి పాదములను స్వర్ణముతోఁ జేయించి తెప్పించి స్వసంస్థానములోని పూజామహలునందుంచి పూజించుచుండిరి. వీరీయాత్రలో ననేక గ్రామములను దానము చేసియుండిరి. వేంకటగిరిలోని బ్రాహ్మణసత్రములో భోజనముసేయని స్వహస్త స్వయంపాకులకు సదావృత్తి జరుగు నేర్పాటు గావించిరి.

క్రీ॥ శ॥ 1866 లో విక్టోరియామహారాణిగారు వీరికి సి.యస్.ఐ. అను బిరుదు నీయఁగా దానిని 1867 సం॥ ఫిబ్రవరి నెలలో మదరాసు గవర్నరుగారు బ్యాంక్వెటింగుహాలులో నీ రాజావారివక్షస్థలమందు ధరింపఁజేసిరి. ఈ రాజుగారు గవర్నరుగారి దర్శనముచేసినపిమ్మట గవర్నరుగారు వచ్చి ప్రతిదర్శన మిచ్చిరి.

ఆసంవత్సరము చెన్నపురిలోని మాసిగానిసత్రమునొద్ద నొక యన్నసత్రమును గట్టించి యందశక్తులగువారలకు దినదినము నూర్గురికన్నమును నూర్గురకు బియ్యమును నిచ్చు నేర్పాటుగావించి తద్వ్యయమునకై 1870 జూన్ 28 వ తేదీని లక్షరూపాయిల దొరతనమువారి పత్రములను దద్విచారణకర్తల స్వాధీనమందుంచి శాశ్వతమైన ధర్మము జరుగునట్టి కట్టుబాటుగావించిరి.

గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ వారి సన్నిధినుండి 'రాజా ఆఫ్ వేంకటగిరి' అను బిరుదుతోఁ గూడఁ బంచహజార్ మన్‌సబ్ దార్ అను



బిరుదులను జేర్చుకొనవలసిన ట్లుత్తరువైనదని 1867 ఆగష్టు 19 తేది నెం 25 రు ప్రొసీడింగ్సు వచ్చినట్లు జిల్లాకలెక్టరుగారు రాజాగారికి దెలియఁజేసిరి.

1869 సం॥లో వీరు డ్యూక్ ఆఫ్ ఎడింబరోగారి దర్శనార్థ మాహూతులై చెన్నపురి కేగి వారిదర్శనము జేసిరి. రాకపోకలయందు గవర్నరుగారు దర్శనప్రతిదర్శనాదులను యథావిధిగఁ గావించిరి.

శ్రీరాజాగారు వేంకటగిరిలోను నాయనిపేటలోను బాఠశాలల నేర్పఱచి 1871 సం॥ నెం 4 రు శాసనానుసారముగ స్థాపింపఁబడిన లోకల్ ఫండుబోర్డువారి స్వాధీనము జేసిరి.

1871 సం॥లో గూడూరుతాలూకాలోని మద్దాళి యనుగ్రామమును ముప్పదివేలరూపాయలకుఁ గొని తిరుపతివేంకటేశ్వరులకు సమర్పించి దానివచ్చుబడిచేఁ బ్రతిదినము ముప్పదిమందిబ్రాహ్మణులకు నాదేవుని నివేదితాన్నము నిచ్చునట్లేర్పాటుగావించిరి. ఆ మఱుసంవత్సరము వీరు నాలవపర్యాయముగఁ గాశికివెడలి యందు 250 జనులకన్నసత్ర మేర్పఱచిరి. బంగాళాదేశ క్షామనివారణార్థమై చెన్నపురిలో జరిగినసభకు వీరు గవర్నరుగారిచే నాహూతులై యిరువదివేలరూపాయలను విరాళ మొసంగిరి. ఆసమయములో గమనాగమనాదులందును గవర్నరుగారి దర్శనప్రతిదర్శనము లందును యథాపూర్వక గౌరవములు జరిగెను.

1875 సం॥ డిసెంబరునెలలోఁ జెన్నపురికి ప్రిన్సు ఆఫ్ వేల్సుగారు దయచేసిన సందర్భమున వీ రాహూతులై తమ పెద్దకుమారుఁడుగారితోఁ గూడఁ జెన్నపురికి వెళ్లిరి. అప్పుడు శ్రీయువరాజుగారికి మనరాజాగా రొక పతాకత్తిని, నబ్బాసికత్తిని దమవంశచరిత్రగ్రంథమును సమర్పించిరి. శ్రీయువరాజుగారును దమదర్శనాభిజ్ఞానమైన యొకపతకము (మెడల్)ను వీరికి దయచేసిరి.

శ్రీయువరాజుగారికి రాయపురములో స్వదేశీయులు జరిగించిన మహాసభాస్థానవేదిక (డ్రైజ్)పై గవర్నరు, కమాండరు ఇన్ చీఫ్ మొదలైనవారితోఁగూడ ననంతశయనముమహారాజాగారికిని, కొచ్చిరాజాగారికిని, బనగానపల్లినవాబుగారికిని, విజయనగరముమహారాజాగారికిని వేంకటగిరిరాజాగారికిని మాత్రమే కుర్చీ లొసంగఁబడెను.

ఈ కుమారయాచమనాయఁడు బహద్దర్ సి. యస్. ఐ. వారు బారాదరీమహల్, అంబారీమహల్ మున్నగు పెక్కుభవనరాజములను గట్టించిరి. పూర్వము నాలవతరమువారైన యెఱ్ఱదాచానాయనివారికి జయలబ్ధమైన స్వర్ణసింహాసనము 22 వ తరమువారినవఱకు సంస్థానములోనే యుంచి యప్పు డార్కాటునవాబువశమైన సంగతి చదువరు లెఱుఁగియేయుందురుగదా! ఈ సింహాసనమును మఱికొన్ని వెలపొడుగు వస్తువులును నార్కాటు నవాబైన గులాంగౌస్ఖానుగారు చెన్నపురిలోఁ గాలధర్మమునొందిన వెనుక చెన్నపురిదొరతనమువారిచే విక్రయింపఁబడనున్నట్లు దెలిసికొని శ్రీవారు తమ పూర్వోపార్జిత సింహాసనమును నన్యాక్రాంతము గానియఁగూడదని తామే 26,000 రూప్యములకుఁ గొనిరి. మఱియు నప్పుడు మూఁడేనుఁగులను ఛత్ర చామరాదులను రజతమయవేత్రములను గొనిరి.

శ్రీవారు దేవస్థానముల కాఱుగ్రామములను, నగ్రహారములుగఁ బహునేకంబు గ్రామములను దానముచేసియుండిరి.

శ్రీవారికి శ్రీరాజగోపాలకృష్ణయాచేంద్రులవారు, శ్రీరామకృష్ణయాచేంద్రులవారు, శ్రీరంగమన్నారుకృష్ణయాచేంద్రులవారు, శ్రీమన్నవనీతకృష్ణయాచేంద్రులవారు, శ్రీముద్దుకృష్ణయాచేంద్రులవారు, శ్రీవేంకటకృష్ణయాచేంద్రులవారు, శ్రీవేణుగోపాలకృష్ణయాచేంద్రులవారు అను నేడ్గురు పుత్రులును, శ్రీలక్ష్మివెంకమ్మగారు, శ్రీరాజ్యలక్ష్మమ్మగారు అను నిరువురు పుత్రికలును జన్మించిరి.

వీరిలోఁ దృతీయపుత్రులైన శ్రీ రంగమన్నారుకృష్ణయాచేంద్రు



లవారిని బొబ్బిలి రాణీగారికి 1871 వ సంవత్సరమున దత్తపుత్రునిగ నొసంగి వెంకటగిరిలోనే మహావైభవముగ దత్తుగావించిరి. వీరిచ్చటినుండి 1872వ సంవత్సరము డిశంబరు నెలలో బొబ్బిలికివచ్చిరి. ఆమఱు సంవత్సరమనఁగా 1873 లో పీఠదత్తపుత్రు నవలోకింప నేగుతఱి పిఠాపురపురాజుగారు 'మేము గరంబు రోగాగ్రస్తులమైతిమనియు మీరెండవ సుతుని నిటకుఁ దోడ్తెచ్చి యవ్యవధానముగా దత్తీయవలెననియుఁ దంత్రీవార్త నంపఁగాఁ బిఠాపురమునకు రెండవ సుతుని దోడ్కొనిపోయి శ్రీ॥ శ॥ 1873 శ్రీముఖసం॥ ఆశ్వయుజ శు 2 నాఁడు దత్తతఁ జరిగించిరి.' మఱియు నాలవకుమారులగు శ్రీనవనీతకృష్ణయాచేంద్రులవారిని 1877 వ సంవత్సరమున శ్రీజటప్రోలురాజాగారగు శ్రీరాజా వేంకటజగన్నాథరావు బహద్దరుగారికి తిరుపతిలో దత్తుగా నిచ్చిరి.

వీరనేకగ్రంథములను సంస్కరింపించినదియగాక మంచినీళ్ళగుంటపై 'మనస్సౌఖ్యకూట' మను నొకశాల గట్టించి యచట సర్వకాలము వేదాంత పురాణగోష్ఠి జరుగుటకుఁ బదునాల్గువేల రూపాయల నిచ్చి మూలధన మేర్పఱచిరి.

ఇట్లు శ్రీరాజాగారు సరిసంపత్తులతోఁ గాలందూఁగుచు ముప్పదియొక్కసంవత్సరము రాజ్యపాలన మొనరించి తమ యఱువదియొకయేట ననఁగా 1892 జూన్ 6 వ తేదీని చెన్నపట్టణమునందుఁ బరమపదము నొందిరి.

స్వర్గీయులైన యీరాజాగారు తమ జీవితకాలములోనే యనఁగా 1878 అక్టోబరు నెలలోఁ దమ జ్యేష్ఠపుత్రులగు శ్రీరాజగోపాలకృష్ణయాచేంద్రులవారిపై రాజ్యభారముంచి 1879 సం॥ మార్చి నెలలో నతివైభవముగఁ బట్టాభిషేకోత్సవమును గావించిరి.

ఇట్లు పట్టాభిషిక్తులైన శ్రీరాజగోపాలకృష్ణయాచేంద్రులవారు గావించిన కార్యములు మహోపకారములై యాచంద్రార్క విరాజితములై యున్నవి. అందులోఁ గొన్నింటి వివరించెదను—

వేంకటగిరి దేవస్థానముల గ్రామము లీ తాలూకాలోని యన్ని వంటులలో నక్కడక్కడ నుండుటచే దేవస్థానవ్యవహారములకు సౌకర్యము లేమి నెఱింగి యాగ్రామములరాబడిని లెక్కించి యందుకు సమమైన రాబడిగల కలువలపూడివంటు నంతయు దేవస్థానముల క్రింద జేర్చి యందందుఁగల దేవస్థానముల గ్రామములను అమానిక్రిందఁ జేర్చుకొని వినిమయము గావించిరి.

నెల్లూరు గొల్లపల్లె యను గ్రామములలోఁ దమ తల్లిగారిపేర సత్రముగట్టించి యాగ్రామమునకుఁ దమతల్లిగారిపేరు వచ్చునట్లు 'లక్ష్మీనరసమాంబాపుర'మని పేరిడి 1880 సం॥లో నగ్రహారము గావించిరి.

మఱియు నీమహోదారుండు 1885 సం॥లో లక్షరూపాయలిచ్చి చెన్నపురిలో విక్టోరియా గోషావైద్యశాలఁ గట్టించిరి. 8000 రూప్యము లిచ్చి చెన్నపురములోనున్న జంఖానా బంగ్లా గట్టించిరి. నెల్లూరులో హైస్కూలు గట్టుటకు నిరువదివేల రూపాయ లిచ్చుటయుగాక యేబదివేల రూపాయలను మూలధనముగా నిచ్చిరి. దాని వృద్ధివలన శాశ్వతపోషణము జరుగునట్లేర్పఱచిరి. మఱియు 1883 లో నప్పటిగవర్నరుగారగు సర్ గ్రాంట్‌డఫ్ గారును 1888లో గవర్నరుగారగు లార్డు కానిమారాగారును నీ వేంకటగిరికి రాఁగా వారల నంబారిలో నూరేగించి విందులొనర్చుటయగాక మొదటివారిచే టవున్‌హాలునకును రెండవవారిచే విక్టోరియాజూబ్లి బంగ్లాకును బునాది రాతిని వేయించిరి. గ్రాంట్ డఫ్‌గారే యింద్రమహాల్ గృహప్రవేశోత్సవమును జరిగించిరి.

శ్రీరాజాగారికి శ్రీవిక్టోరియామహారాణిగారివలన 1888 వ సంవత్సరములో కే. సి. ఐ. ఇ. అను బిరుద మొసఁగఁబడెను. ఆసందర్భమందును దదితరసమయములందును గవర్నరుగారిదర్శనమునకై వీరు చెన్నపురి కేగునప్పుడు పూర్వాచారానుసారముగ ధూమశకటపరిసరము (రైలుదగ్గఱకు) నకు శ్రీగవర్నరుగారి రథము (మోటారుకారు) ను పడేకాంగు 5 తురుపుసవార్లతో వీరికై తీసికొనివచ్చి యెక్కించు



కొనిపోయి విడిదిలోఁ బ్రవేశపెట్టుటయు మఱల వచ్చునప్పు డదేవిధముగఁ దోడ్కొనివచ్చుటయు, శ్రీరాజాగారు గవర్నరుగారిదర్శనము చేయునప్పుడు వారు మఱల శ్రీరాజాగారిభవనమునకువచ్చి ప్రతిదర్శన మిచ్చుటయు మున్నగుగౌరవములు యథాప్రకారముగ జరుగుచుండెడివి. మఱియు మైసూరు, అనంతశయనము, కొచ్చిమహారాజులును చెన్నపురియందు వీరికి దర్శనప్రతిదర్శనము లిచ్చుచుండిరి.

వీరు రెండుపర్యాయములు చట్టనిర్మాణసభ (లెజిస్లేటివ్ కౌన్సిల్) లో సభ్యులుగ నుండిరి. మఱియుఁ జెన్నపురిలో జమీందార్ల అసోసియేషన్ సభకు నిరువదిరెండు సంవత్సరము లగ్రాసనాధిపతులుగ నుండిరి.

1910 జూన్ 24వ తేదీని నైదవ జార్జిచక్రవర్తిగారిచేఁ దదీయ జన్మదినోత్సవ సమయమునందు శ్రీరాజగోపాలకృష్ణయాచేంద్ర బహదరు కె. సి. ఐ. ఇ. గారికి 'మహారాజా' బిరుదము నొసఁగఁబడెను.

శ్రీమహారాజాగారు భాషాపోషకులనుటకు నిదర్శనముగ వీరి కాలమున నాంధ్రకవులు రచింపఁగా నీదిగువ, గ్రంథములు ముద్రింపఁబడి ప్రకటింపఁబడియె.—(1) రాధాకృష్ణసంవాదము. (2) శిశుపాలవధ. (3) దశకుమారచరిత్రము. (4) శృంగారపద్యరత్నావళి. (5) అమరుకకావ్యము. (6) శ్రీకృష్ణాభ్యుదయము. (7) గీతగోవిందము. (8) బ్రహ్మవైవర్తములోని బ్రహ్మగణేశప్రకృతిఖండములు (9) హాలాస్యమహాత్మ్యము (10) కాళిదాసప్రకరణము. (11) వినోదకథాకల్పవల్లి. (12) గోపీకథాకౌముది. (13) సుమనోవినోదభాషణము. (14) కథాసరిత్సాగరము. (15) యాచశూరేంద్రవిజయము. (16) ఉత్తరరామచరిత్రనాటకము. (17) సంస్కృతకవిజీవితము. (18) రుక్మిణీపరిణయము మున్నగునవి. మఱియు వీరు చెన్నపురిలో స్థాపింపఁబడిన యాంధ్రపరిషత్తునకు విశేష ద్రవ్య మొసంగిరి.

ఇట్టుల నాంధ్రభాషాపోషకనామమును సార్థకము గావించి యుకన్నాత్తుగ శ్రీమహారాజావారు 1916 జులై 23వ తేదీని స్వర్గస్థులైరి.

వీరియనంతరమున వీరిపుత్రరత్నంబగు శ్రీగోవిందకృష్ణయాచేంద్ర బహదరువారు రాజ్యమునకువచ్చిరి. శ్రీరాజావారి పట్టాభిషేక మహోత్సవము 1917 ఫిబ్రవరి నెల 1 వ తేదీని నత్యంతవైభవముతో జరిగెను. తత్సందర్భమున శ్రీరాజాగారి సందేశమును దివాంజి రావు బహదరు తిక్కాని బాలాజీరావునాయుడుగారు ప్రజలకు ప్రకటించిరి. అందు వేంకటగిరి పురాతనపట్టణమగుటచే నాలుగు రాజమార్గములు దప్ప తక్కిన మార్గములు విశాలముగనుండవు గనుక శ్రీవారు వేంకటగిరిపట్టణమును నూతనపద్ధతిని బునర్నిర్మాణ మొనరించునటులఁ బ్రకటించి పౌరుల కృతజ్ఞతకుఁ బాత్రులైరి. నెల్లూరునందుగల శ్రీమహారాజావారి యున్నతపాఠశాలను రెండవతరగతి కళాశాలఁగ జేసెదమని వాగ్దాన మొనరించి స్వీయవిద్యాభిమానమును వెల్లడించి విద్యాభిమానుల కృతజ్ఞతకును బాత్రులైరి. మఱియు వేంకటగిరిపట్టణమందు శ్రీరాణీగారిపేర నొకకర్మవిద్యాలయమును స్త్రీలకు వైద్యసాహాయ్యలాభమును గలిగించుటకై యొక ఘోషాఆసుపత్రిని నెలకొల్పెదమనియుఁ బ్రకటించిరి. మఱియు బీదరయితుల సాహాయ్యార్థమై పదునాఱువేల రూప్యముల శిస్తు బాకీలను రద్దుసేయ నాజ్ఞ యొసఁగి నిరుపేదరైతుల కానందమును గలిగించిరి.

ఇటులఁ బౌరజనంబుల యొక్కయు విద్యాభిమానుల యొక్కయు హృదయపూర్వకమైన కృతజ్ఞతకుఁ బాత్రులై, యాంధ్రలోకంబునందెల్ల సుప్రసిద్ధులును దొరతనమువారిచేఁ బెక్కుగౌరవానులందిన వారును రాజకీయధురంధరులును నగు రావుబహద్దరు శ్రీ తిక్కాని బాలాజీ రావు నాయుడుగారు దివాంజీపదవి నలంకరించియుండఁగా శ్రీరాజావారు ప్రజారంజకంబుగా రాజ్యపాలనంబు సేయుచుండిరి.

ఇట్టి శ్రీ రాజా గోవిందకృష్ణయాచేంద్ర బహదరువారికి కరుణాసముద్రుఁడగు పరమేశ్వరుఁడు శాశ్వతాయురారోగ్యంబులఁ బ్రసాదించుఁగాత.

———:o:———